710

Reg. No. 757

అభినవసరస్వతి

యను నొక మాసపత్రిక

నాగరఖండ స్వర్ణకారవ్యవహారాది బహుగ్రంథకర్తయగు

జనపాటి పట్టాభిరామశాస్త్రిచే

ప్రచురింపబడుచున్నది

జనపాడు

సంపుటము 19 { 1927 సం॥ జనవరి నెల } సంచిక 10

విషయములు

చందానిర్ణయము సంవత్సరమునకు

ప్రధానపోషకులకు	రు 25 0 0	సహాయులకు	రు 5 0 0
పోషకులకు	రు 10 0 0	చందాదారులకు	3 0 0

Printed at the Chandrika Press, Guntur,
and published at Janapadu by the Editor, Astavadhani
Janapati Pattabhirama Sastry,
author of Nagarakhandam, Swarnakaravyavaharam
etc., etc

ప్రధానపోషకులు

౧ శ్రీ శ్రీ జగద్గురు విరూపాక్ష స్వాములవారు, నారాయణపేట
౨ శ్రీ శ్రీ జగద్గురు పుష్పగిరి స్వాములవారు, దుబ్బాక.
౩ బాకరాజు పరాంకుశరావుదేశాయిగారు యాదవరం
౪ రామసింగుగారు- నెల్లుట్లసాపురసంస్థానముల మేనేజరు- నెల్లుట్ల
౫ శ్రీమద్వెంకట శేషారెడ్డి రామచంద్రారెడ్డి దేశముఖుగార్లు, అల్లాదుర్గసంస్థానము

పోషకులు

౧ శ్రీ శ్రీ జగద్గురు అభినవ విరూపాక్ష పీఠాధిపతులు, విశాఖపట్టణంజిల్లా
౨ ఎనమండ్ర లక్ష్మీనరసింహముగారు, మర్చెంటు, బెజవాడ
౩ రాజా వెంకటాద్రియప్పారావు, బహదరుగారు, వుయ్యూరుయెస్టేటు
౪ రాజామంత్రిప్రగడ వెంకటహనుమంతరావు, రాఘవరావుగార్లు, లింగగిరి
౫ తంగెడ నరసింహారావుగారు, కరణం, మోర్జంపాడు
౬ శ్రీ [illegible] పుస్తకభాండాగారము, లక్ష్మీనర్సాపురము
౭ లింగాల వెంకటరెడ్డి దేశముఖుగారు, కుందవరము
౮ చారబుడ్డి రత్నారెడ్డిపటేలుగారు, న్యాలపోగుల
౯ టి లక్ష్మణసింగుగారు, జోనగాం
౧౦ నెల్లుట్ల నరసింహారావుగారు, జోనగాం
౧౧ రంగాచార్యులుగారు, ముక్త్యారు, దేశముఖు, మసీదుపల్లె
౧౨ ఉమలపల్లి కృష్ణారెడ్డిగారు, కేశవాపురము.
౧౩ జాగర్లమూడి కుప్పుస్వామినాయుడుగారు, కారంచేడు
౧౪ పిశుపాటి వెంకటరాయశర్మగారు, కరవది
౧౫ శ్యామాపంతుల వెంకటేశ్వరరావుగారు, తహశీల్దారు, పాకాల
౧౬ గూడూరి వీరసాంబశివరావు సద్దేశపాండ్యాగారు, మానుకొండూరు
౧౭ కొత్వాలి వెంకటేశ్వరరావుగారు, సంగెం
౧౮ లింగాల రంగారెడ్డి దేశముఖు, గణపురం,

సహాయులు

౧ వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రిగారు, చెన్నపట్టణము
౨ బుడంపాటి సుబ్బయ్యగారు, మర్చంట్, కాకినాడ
౩ కుంటుపల్లి రామారావుగారు, సంగెం
౪ పెద్దిభట్ల వీరయ్యగారు, ప్లీడరు బెజవాడ
౫ నెల్లుట్ల కేశవరావు దేశముఖుగారు, నెల్లుట్ల
౬ రంగావఝ్ఝల రంగయ్యగారు, నర్సారావుపేట
౭ నారాయణరావుగారు, దాశారుపల్లె

అభినవసరస్వతి

సంపుటము ౧౯ { జానపాగు
ప్రభవ సం॥ పుష్యమాసము } సంచిక ౧౦

అల్లసాని పెద్దనార్య కవిత్వతత్త్వము

కం॥ "తన మొగము తనకు నగపడ, దనువుగ నద్దమునఁ గాక ...
ఘనుఁడైనను గవి యొరుచే, తన తెలిసికొనంగ నగును దన తప్పొప్పుల్."

మహామహోపాధ్యాయ కొక్కొండ వేంకటరత్నము పంతులవారు (సుబద్ధుఁడు)

జాతి నున్నతస్థితికిఁ దెచ్చు మూలకారణములలో సారస్వతప్రక్రియ మొదటిది. ఇది జాత్యభివృద్ధికి ననువగు నాదర్శముల నేర్చి కూర్చి వానిం జేరు నుపాయములఁ గరతలామలక మొనర్చి మనోవృత్తుల వికసింపఁజేసి క్రియాసిద్ధి నందఁ బురికొల్పును. ...

ఔన్నత్యప్రదములగు నాదర్శములఁ జూపు సారస్వత పుష్కల్య మున్నతావుననే నిక్కమగు నాగరకతయును జాత్యౌన్నత్యమును గాన్పించుచున్నవి. కావున లోకములో నౌన్నత్యముం గోరు జాతులు సారస్వతాభివృద్ధిఁ గావించుకొనఁ బాటుపడుచుండ్రు. ఇప్పు డాంధ్రు లెల్లరును స్వాభివృద్ధికై సర్వవిధములఁ బనిచేయుచున్నారు సారస్వతాభివృద్ధికిఁ గూడ వీరు పాటుపడుచున్నారు. మనలో సారస్వతప్రక్రియ పుట్టి యించుమించుగాఁ దొమ్మిదివందలేండ్లయినను నింకను బొందఁదగిన యభివృద్ధికి నీ సారస్వతము రాలేదని విజ్ఞులగువారు తలంచుచున్నారు. తొమ్మిదివందలేండ్లనుండి వ్యాప్తి నందఁ జూచుచున్న మన సారస్వతములో లెక్కకు రాఁదగిన గ్రంథరాజములు మిక్కిలి తక్కువగా నున్నవి. నన్నయభట్టారకుఁడు మొదలు నేఁటివఱకును బుట్టిన గ్రంథముల నెల్ల లెక్కించిన లెక్కకు మిక్కిలిగా నుండుననుటకు సందియము లేదు అట్లయిన మిక్కిలి తక్కువగా నున్నవని యెట్లు తెల్పితి వందురేనిఁ జాలభాగము గ్రంథము లన్నియు నొక్కటియే పోఁతఁగ్గియున్నవి. ఒకటియే గమనిక; ఒకటియే రసము. ఒకగ్రంథముఁ జూచిన రెండవగ్రంథమం దేమియుండునో చెప్పవచ్చును. పెద్దనార్యుని మనుచరిత్రము పుట్టినది మొద లాంధ్రవాఙ్మయ ప్రవాహ మంతయు శృంగార రసప్రవాహమై పోయినదని చెప్పనగును. నడుమ నడుమ నితర రసప్రధానములగు హరిశ్చంద్రోపాఖ్యానాదులు పుట్టినను మొత్తముమీఁద శృంగారరసప్రధానములగు గ్రంథము లమితముగాఁ బుట్టినవి. వీనియందుఁ బచ్చి శృంగారము చాల హెచ్చుగా

నున్నది. దీనికింగల కారణము దూరమై దురూహ్యముగాలేదు. లోకమును సర్వసామాన్యముగా నాకర్షించునది శృంగారము. ఆహేతువుచే మన కవు లాప్రవాహములోఁబడిపోయిరి. మరలించువార లంతగా లేకపోయిరి. మనవారికిఁ గావ్యనిర్మాణమునందే యభిలాష హెచ్చుగాఁ గలదు గాని సారస్వతాభివృద్ధికి మూలములగు తదితర మార్గములఁద్రొక్కుటకంతగా నభిలాషలేదు. సారస్వతాభివృద్ధికిఁ గావ్యనిర్మాణ మెట్లవసరమో దాని విమర్శనమును నంత యవసరము. విమర్శనము కవులఁ బెడదారులఁ బోనీక మంచిమార్గమునకు మరల్చుచుండును. కావ్యకల్పనా కుశలతకలవారు వానిని గల్పించుచుండిన, విమర్శకులు వానిమంచి చెడ్డల విమర్శించుచుండవలయును. విమర్శనభాగము మనలోఁ దక్కువగానున్నది. వేఱుగ విమర్శకులు లేరు. ఆహేతువుచే మనపూర్వకవులు, పాపము కావ్యనిర్మాణమును జేయుభారము నేగాక విమర్శభారమును గూడఁ గొంతవరకుఁ దలపైఁ బెట్టుకొనుచు వచ్చిరి. తిక్కన తననిర్వచనోత్తర రామాయణములోఁ గావ్యకల్పనము చేయుమార్గములంగూర్చి ముచ్చటించి కుకవితిరస్కృతిఁ గావించె. సుకవిస్తుతినొనరించె. పింగళి సూరనాదులును నట్లే చేసిరి. అదిమొదలు మనలోఁ గబ్బముల నల్లువారెల్లరును సుకవిస్తుతిని కుకవినిందను దప్పక కావింప మొదలిడిరి. విమర్శనములు మనలో లేకుండినను మనసారస్వతమంతయు నొక్కటియే మొఱ్ఱ పెట్టుచున్నది. ఏమని? సారవంతమగుకవిత్వమును స్తుతించితీరవలె? అట్లే సారహీనమగు కవిత్వమును నిందించి తీరవలెననియే. వీ రిట్లేల చేయవలసివచ్చినది? ఇది కావ్యకర్తృకపని యెట్లయినది? సారహీనమగు కుకవిత్వము నిందితమై త్రోసివేయఁబడకుండిన సారవంతమగు కవిత్వ మభివృద్ధినందదు. కావున గుణాగుణవిమర్శన మవశ్యకర్తవ్యము. అట్లుచేసినంగాని నిక్కమగు సారస్వతాభివృద్ధి కానేరదు. కాఁబట్టి సత్యాంధ్రసారస్వతాభివృద్ధియందలి యభిలాషచే గ్రంథరాజములవరుసగా విమర్శింతును. మనయాంధ్రసారస్వత శృంగార ప్రవాహమునకు జన్మస్థానమైన పెద్దనార్యకృత మనుచరిత్రమును బ్రప్రథమమున నీచిన్ని గ్రంథమున విమర్శించెదను. ఈకవి తల్లజుని ప్రఖ్యాతింబట్టి యీగ్రంథమునందలి ప్రమాదములుకూడ గొప్పగుణములుగా లోకముచే నెంచఁబడుచున్నవి. విమర్శకుఁడు రాగద్వేషములకు లోనయి గుణమును దోషమనరాదు. దోషమును గుణమనరాదు. మఱియును మోమోటమునకును జంకునకును లోనుగాక తనకుఁ దోఁచినదానిని సరిగ లోకమునకు సువ్యక్తముచేయవలెను. అప్పుడు గాని విమర్శనములవలనిఫల ముండదు. కావున నీయుద్గ్రంథముపై నాకుఁదోఁచిన దానినెల్ల స్పష్టముగా వ్రాసినందులకుఁ జదువరులు నన్ను మన్నింపవలెను. ఈ ప్రసిద్ధకవి తప్పులనుగూడ మనవా రెట్లు గుణములనుగా స్తుతించుచు వచ్చిరో వానినెల్ల నింకఁ జూపుచుందును. దోషముల గుణములనుగా నెంచినపుడు విమర్శకులు తప్పక యడ్డుపడవలెను.

ఆంధ్రకవితాపితామహుం డని పేరందినట్టియుఁ గవిరాజును రాజకవియు నగు కృష్ణదేవరాయనిచే మిగుల మన్ననఁ బడసినట్టియు నాంధ్రమహాకవి యగు పెద్దనార్యుఁ డాంధ్రలోకమునఁ జాల సుప్రసిద్ధమహాకవిగా నున్నాఁడు. ...

క॥ "పెద్దనవలెఁ గవి చెప్పినఁ, బెద్దనవలె నల్పకవిని బెద్దనవలెనా!
యెద్దనవలె మొద్దనవలె, గ్రద్దనవలెఁ గుందవరపు కవిచౌడప్పా" ...

ఈతఁ డిట్లు ప్రసిద్ధకవి గావున నే నీతని గ్రంథవిమర్శనమునకుఁ గడంగితిని పాలసముద్రముం దరచినప్పుడుగదా యమృతమైనను హాలాహలమైనను బుట్టుట !

శబ్దార్థంబులు కావ్యకన్యకు మూర్తి యని లాక్షణికులు వచించియున్నారు. కావునఁ బెద్దనార్యుని కవితాకన్యయొక్క మూర్తి యెట్లున్నదో యనఁగా రచన యెట్లున్నదో ముందుగా విచారింతము. పదములకూర్పులోఁ బెద్దనార్యుఁడు చాల నేర్పుకలవాఁడు. అపారమగు నుభయభాషాజ్ఞాన మీతనికిఁ గలదు. శబ్దజాలమంతయు నీతని జిహ్వాగ్రమున నటించుచుండె. ఆయాపదముల నేర్చి కూర్చుటలోఁగూడ నీతనికి మంచి సామర్థ్యము కలదు. ఈ వైశద్యమే యీతనికిఁ జాలఁ బ్రఖ్యాతిని దెచ్చినది ఆయాకవుల వైదగ్ధ్యమును వర్ణించుటలోఁ బాంచాలీపరిణయకర్త యగు కాకమాని మూర్తికవి :—

గీ॥ "అల్లసానివాని యల్లిక జిగిసొంపు, ముక్కుతిమ్మనార్య ముద్దుపలుకుఁ
బాండురంగవిభుని పద్యంబుహరువును, గాకమానిరాయ నీకె గలదు."

అని యల్లసానివాని నల్లికను మెచ్చుకొనియున్నాఁడు. ... ఇతరమునం దీతనికిఁ బ్రజ్ఞ లేదను భావము కాదు గాని యీతని ముఖ్యప్రజ్ఞ యల్లికబిగి యని రూఢి పడుచున్నది. ఇందులో నీతనిని మొదటితరపు కవి యని చెప్పవచ్చును.

ఈతని రచనమునందుఁ గొన్ని దోషముల నెంచెదరు. ఆముక్తమాల్యదయందు నెంచఁబడిన విసంధిదోషాదు లిందును గొంతవఱకుఁ గలవు. కాని యవి నెరసులు అంతగాఁ బాటింపఁదగినవి కావు. ...

ఇందలిభాష చాల సలక్షణమైన గ్రాంథికభాష. లక్షణవిరుద్ధము లగు ప్రయోగము లతివిరళములు. ఈతఁడు చమత్కారముకై యొక కొన్ని నియతస్థలముల నవ్యభాషాపదములఁ బ్రయోగించె ...

తనకుఁ బూర్వమునం దున్న నన్నెచోడుఁడు, సమకాలమున నున్న రాయలవారు, ధూర్జటి మున్నగువారివలె మనుచరిత్రములోఁ గర్ణాటభాషాపదములు లోనగువానిని వాడియుండలేదు ఇప్పటివారివలె భాషాసాంకర్యము చేయ నిచ్చగలవాఁడు

కాఁడు. "హిందూరాజ్యరమాధురంధర" అని హిందూశబ్దమును వాడె. కాని యిది సంస్కృతపదమె యని మనదేశపూర్వులు పలువురు తలంచిరి. "హీనం దూషయతీతి హిందూః" అనువ్యుత్పత్తి మహామేరుతంత్రమునం దీయఁబడియున్నది. "హీనంచ దూషయ త్యేవ హిందూ రి త్యుచ్యతే ప్రియే" అని మేరుతంత్రమునందుఁ గలదు. వాచస్పత్యాదులం దిది సంస్కృతపదముగానే తీసికొనఁబడి వ్యుత్పత్తి యీయఁబడి యున్నది. కొందఱ కిది యన్యభాషాపదమనుతలం పుండవచ్చును. పఱ్వార కట్టి తలంపు లేదు. కాఁబట్టి యిది యన్యభాషాపదము కాదు. "మూరురాయరగండాదులు" నామ ములలోఁ జేరఁదగినవియే యై యున్నవి. ...

ఈతనియందు గ్రంథచౌర్యదోష మొకటి మోపఁబడియున్నది. ఈ మహాకవి శ్రీనాథుని గ్రంథములనుండియు, మారనకబ్బమునుండియుఁ బినవీరన్న పొత్తముల నుండియుఁ గృష్ణదేవరాయని పుస్తకమునుండియు మఱికొన్ని యితర గ్రంథముల నుండియుఁ గొంత పదార్థ సంగ్రహము చేసినమాట నిజము, ... ఇది చౌర్యమని కొంద ఱును, కాదని కొందఱును వాదించుచున్నారు. గ్రంథచౌర్యము కాదు; కాని పెద్ద యనుకరణము. ఇది మన సారస్వతముయొక్క గమనికను దెలుపునది గాన దీనింగూర్చి కొంత యిచ్చట వ్రాయవలసి యున్నది.

మన వాఙ్మయము భాషాంతరీకరణముతోఁ బ్రారంభ మైనది. నన్నయాదు లీ భాషాంతరీకరణమును గావించిరి. ఒక సంస్కృతగ్రంథమును బుచ్చుకొని దానిని దెలుఁగులోనికి దింపుచువచ్చిరి. తరువాత ననుకరణము ప్రారంభమైనది. అది పెద్ద నాదులనాఁడు గలిగినది. వీరు పూర్వులవలె నొక సంస్కృత గ్రంథమును దీసికొని తెలుఁగులోనికి వరుసగా దింపక యాయాపూర్వకవుల వ్రాతల ననుసరించి తమ గ్రంథ ములఁ బూరించుకొనుచు వచ్చిరి. కొన్ని యెడల సందర్భానుసారముగాఁ బూర్వ సంస్కృతగ్రంథములలోని శ్లోకములఁ దెనిఁగించి తమ గ్రంథములలోఁ బెట్టుకొనుచు వచ్చిరి. కొన్నియెడలఁ బూర్వపు టాంధ్రకవుల వ్రాఁతల ననుకరించుచువచ్చిరి. పెద్దన యిట్టి యనుకరణము చాలఁ జేసినాఁడు. ...

ఇట్టి యనుకరణములను గాళిదాసాదులును గావించిరి. వాల్మీకి వ్రాఁతలఁ గాళి దా సనుకరించెను. షేక్స్పియరు నట్లె పూర్వుల ననుకరించెను.

పరికించిచూడ నితరుల గమనికల ననుసరించుటయే గాక పరుల పద్యముల నున్నవి యున్నట్లే మన కవి తన గ్రంథమునఁ గొన్నితావుల నెక్కించియున్నాఁడని కూడఁ జెప్పవలసివచ్చుచున్నది. ఈతఁడు కృష్ణదేవరాయని యాముక్తమాల్యదనుండి పయిరీతి సంగ్రహము చేసినాఁడు ఇందుల కొక యుదాహరణముం దీసికొందము —

సీ॥ " నీలమేఘముడాలు డీలుసేయఁగఁజాలు మెఱుఁగు జామనిచాయ మేనితోడ
నరవిందములకచ్చు లడఁగించు జిగిహెచ్చు నాయతంబగు కన్నుదోయితోడఁ
బులుఁగురాయనిచట్టుపలవన్నె నొరపెట్టు హొంబట్టుజిలుఁగు గెంజెంబుతోడ
నుదయార్కబింబంబు నొఱపువిడంబంబు దొరలంగనాడు కౌస్తుభముతోడ. "

ఈ నాలుగుపాదములును సరిగ నీరీతినే కృష్ణదేవరాయల యాముక్తమాల్యద యందును, పెద్దనార్యుని మనుచరిత్రమందును గూడఁ గాన్పించుచున్నవి. వీనియెత్తుగీతములు మాత్రము రెండింట భిన్నములుగా నున్నవి. ఇఁక వీరిలో నెవ్వరి నెవ్వ రనుకరించి రనువిషయము తెల్పవలసియున్నది. పెద్దనార్యుని పద్యమును కృష్ణదేవరాయలు తీసికొనినట్లుగాఁ గొందఱు తలంచుచున్నారు గాని యది సరికాదు. ఏమన :— (1) మనుచరిత్రముకంటె నాముక్తమాల్యద ముందు పుట్టినట్లు తెలియవచ్చుచున్నది. ఎట్లన :—

కృష్ణదేవరాయ లాముక్తమాల్యదను క్రీ-శ. ౧౫౧౫ సం॥మునఁ జేయ మొదలిడె నని కవులచరిత్ర ... దెల్పుచున్నది :—

... ఇఁక మనుచరిత్రాదు లెప్పుడు ప్రారంభింపఁబడినవో కనుఁగొందము :— ఈ విషయమునఁగూడఁ గవులచరిత్ర మిట్లు నుడువుచున్నది. ...... అల్లసాని పెద్దన తన స్వారోచిషమనుచరిత్రమును నందితిమ్మన్న తన పారిజాతాపహరణమును ౧౫౧౬ వ సంవత్సరమునకుఁ దరువాతను ౧౫౨౦ సం॥మునకు లోపలను కృష్ణదేవరాయల కంకితము చేసిరి.

దీనింబట్టి చూచిన విష్ణుచిత్తీయమును కృష్ణదేవరాయలు రచించుటకు మొదలిడిన తర్వాతనే మనుచరిత్రమును వ్రాయఁ బెద్దన మొదలిడె నని తేలుచున్నది. ఆముక్తమాల్యదయే మొదటి గ్రంథ మని మఱికొందఱుగూడ వ్రాసిరి. లోకములోని వాడుకగూడ విష్ణుచిత్తీయ రచనానంతరముననే మనుసంభవము పుట్టినట్లు తెల్పుచున్నది. ....

అదిగాక వీరిద్దఱిలోఁ గృష్ణదేవరాయలు వడిగ గ్రంథమును బూర్తిచేయు వాఁడుగాఁ గాన్పించుచున్నాఁడు. అతఁడు ఘనరాజకార్య ధూర్వహుఁడై యుండియును యుద్ధనిమగ్నుఁడై యున్నను పెద్దనకంటెఁ దక్కువకాలము బ్రతికినవాఁడైనను ౧ మదాలసచరిత్ర, ౨ సత్యావధూప్రీణనము, ౩ సకలకథాసారసంగ్రహము, ౪ జ్ఞానచింతామణి, ౫ రసమంజరి, ౬ ఆముక్తమాల్యద యను గ్రంథముల విరచించెను. బహుకాలము బ్రతికిన పెద్దన్న యన్నో యొక్క మనుచరిత్రమును మాత్రము తన జీవితకాలములో వ్రాయఁగలిగె. హరికథాసారమును గూడ వ్రాసె ననినను నాతఁడు బ్రతికిన కాలముంబట్టిచూడఁ జాల తక్కువగ గ్రంథములు వ్రాసె ననియుఁ గవిత్వము నతిత్వరితముగఁ జెప్పఁజాలనివాఁ డనియుఁ దేలుచున్నది

... ఈతనిచే రచియింపఁబడిన యీ క్రిందిపద్య మీతఁడు చాల రాజసపు గవి యని చాటుచున్నది

చం॥ “నిరుపహతిస్థలంబు రమణీ ప్రియదూతిక తెచ్చియిచ్చు క
ప్పురవిడె మాత్మకింపయిన భోజన ముయ్యెల మంచ మొప్పు త
ప్పరయు రసజ్ఞు లూహ తెలియంగల లేఖక పాఠకోత్తముల్
దొరకినఁ గాక యూరక కృతుల్ రచియింపు మటన్న శక్యమే”

... ఇట్టివాఁడు మనుచరిత్రమును రచించుట కెంతయో కాలము పట్టియుండును. ఓగిరాల జగన్నాథకవిగారి సుమనోమనోభిరంజనమువలె బహుకాలము దిద్దిదిద్ది వ్రాసిన గ్రంథమైయుండును. కాన మనుచరిత్రమునందలి ఒక యాశ్వాసము బయలువెడలు నప్పటికి బహుకాల మగుననుటకు సందియము లేదు. ఇట్టి స్థితిలో ముందు గ్రంథమును ప్రారంభించిన కృష్ణదేవరాయలు తరువాత గ్రంథమారంభించిన పెద్దన బహుకాలము శ్రమపడి వ్రాసిన మనుచరిత్రములోని తుదిదగు “నీలమేఘముడా” లను పద్యమువఱకు వేచియుండి యుండుండి తరువాతఁ దీసికొని మొదటి పీఠికలో వేసికొనెననుట పొసఁగియుండదు.

(౨) ఇంకను నితరుల గ్రంథములనుండి పదార్థసంగ్రహము, చేయు స్వభావము కలవాఁడను వాడుక కొంచెముగానో గొప్పగానో పెద్దనార్యుం గూర్చి కలదు గాని కృష్ణదేవరాయునిం గూర్చి లేదు. మఱియును నీ పద్యము, ఆముక్తమాల్యదలో గ్రంథ కారణముం జెప్పెడియీ గ్రంథకర్తయొక్క యిష్టదైవముంగూర్చి మొదటి పీఠికలోనే వ్రాయఁబడియున్నది. మనుచరిత్రమునం దన్ననో గ్రంథాంతమున గ్రంథస్థపాత్రము చేయు స్తుతిలో నున్నది కావున రాయలవారు తమ యిష్టదైవతముంగూర్చి మొదట ముచ్చటించుటలోనే పరునిపద్యముం దీసి వాడుకొనె ననుటకంటెఁ బెద్దనార్యుఁడు రాయలవారియం దుండెడి గౌరవముచే వారి పద్యమును గ్రంథము చివర నున్న యొక స్తుతిలో నిక్కించెననుట భావ్యముగా నుండును. రాయలవారి మెప్పునుగోరియే గదా తన చిన్ననాఁటి యద్వైతమతమును వీడి విశిష్టాద్వైతమునఁ బ్రవేశించినాఁడు. ఈతఁడు రాజు నెట్లయిన మెప్పింపఁ జూచువాఁడను భావము తెల్పుచున్నది. ఇవియన్నియు నటుండఁ, మొదటి గ్రంథము వ్రాయఁ బ్రారంభించిన కవి తరువాత గ్రంథము వ్రాయఁ బ్రారంభించిన కవియొక్క గ్రంథమునందలి తుదిపద్యములు విరచింపఁబడువఱకు వేచియుండి, యప్పుడా తుదిపద్యములలో నొకదానిని దీసికొనివచ్చి మొదటఁ బీఠికలో నిష్టదైవతముంగూర్చి తెలుపవలసినచోట నతికించుట యెటు పొసఁగును! ......

ఇఁక నుభయుల గ్రంథములలోని పీఠికలలోఁ గూడఁ గొంత యొకటియే కథనము కాన్పించుచున్నది. ఈయది రాయలప్రశ్నంగూర్చి ముచ్చటించు పద్యములందుఁ గలదు. రాయలవారు తమ స్తుతిపాఠమును దామే చేసికొన నిష్టములేక పెద్దనార్యుని పద్యమును వాడుకొనిరని చెప్పెదరు. ఇది యెంత పెద్దవింత. తన్నుఁ దాను స్తుతించుకొనుటయు, నితరులు తన్నుఁ జేసిన స్తుతిపాఠమును దానే మరలఁ బఠించుకొనుటయు నొకటి గాదా? కావున నిట్టి వెడఁగుయుక్తులు చెప్పుటకంటెఁ బరుల పద్యముల ననుకరించు స్వభావము పెద్దనార్యునందుఁ గలదు గావున రాజున కానందము గలుగుటకై యాతని పద్యములనే స్వీకరించి తనమనుచరిత్రములో వేసికొనియె ననుటయే యుచితము. రాయలవారి వన్నియుం గ్రొత్తరాకలు. పరుల ననుకరించు స్వభావ మందు లేదు. పెద్దన్న దన్నిటో యంతయు ననుకరణమే. కావున రాయలపద్యమును బెద్దన్న యనుకరించె ననుట యుచితము. కాని యిదియును గ్రంథచౌర్యము కాదు. కవిత్వపటుత్వ విషయములోఁ బెద్దనయందు లేమిలేదు. ఇఁక నేల యనుకరించె నన వారివారియందలి గౌరవముచే నితరుల నీతిఁ దనుకరించుచు వచ్చె ననుట యుచితము.

ఒక్కచోఁ శ్రీనాథాదుల నీతిఁ దవిచారపూర్వకముగాఁ గూడ ననుకరించె నని కొంత చెప్పవచ్చును. ఎట్లన:—

పాణినిఁగూర్చి ముచ్చటించుచు శ్రీనాథుఁ డాతనిని పణినసూనుఁ డని తప్పువ్రాఁత వ్రాసియుండఁగాఁ దాను గూడ "పణినసూనుకణాదబాదరాయణ సూత్రఫక్కి-విద్వాంసు లుపన్యసింప" నని వ్రాసె. "పాణినిని పణినసూనుఁడనుట యపాణినీయము, తప్పు శ్రీనాథునితప్పునే పెద్దన యనుకరించె. "గాధి విదధి కేకిగణిపణినశ్చ" అను సూత్రముచే "పాణినసూనుఁ" డని యుండవలెను. కాని "పణినసూనుఁ" డని యుండ వలనుగాదు. . . .

తినవె శిరీషకుసుమపేశల సుధామయోక్తులని పెద్దన వ్రాసికొనియె. మన వారును నీతనిది మృదుమధురకవిత్వ మనుచున్నారు. కాని యది సత్యము కాదు. శైలి కతని శైలి మార్దవము లేదు. అయినచోటను గానిచోటను గూడఁ బరుషాక్షరసంఘటిత గాఢగూఢసమాసములు వేసి తనవు దర్దురము చేసినాఁడు. కొన్ని యుదాహరణములం గనుఁడు:—

తండ్రి మనోరమకు నరణముగా నిచ్చినయూళ్ళను జెప్పుచు —

సీ॥ " అవనతాంగుష్ఠాగ్రపార్శ్వనిర్యద్రత్న ఖనిఘనాంతరితక్ష్మాంగాటకములు

మదము దావహాదివ్యమైరేయధారేయగోత్రభిద్విటపినిష్కుటయుతములు

మహీశోకదంబడింభగాత్రివ్యాఘ్రవ్యూహచరత్కృగవాభిసౌరభ్యనిర్భరములు
ప్రఖరాఖునఖరదంష్ట్రావిదీర్ణోద్గీర్ణసౌవర్ణ వృత్తికర్ణ జాంగలములు ”
అని వ్రాసె ...

... శృంగార రసప్రధాన మగుచోటఁ బురవర్ణనము చేయుటలో:—

మ॥ “ అనుచుం జందనపంకపంకిలతలంబై కేతురుద్ధాంహా
ధ్వనిరుణ్ణంబయి మంచెకోపరికుటీవాటీనటన్నర్తకీ
జనమై యావతసర్వతఃకలితవీక్షాతోరణస్రిజ్జ్నబం
ధనమై యొప్పు పురంబు సొచ్చి భవనద్వారప్రఘాణంబునన్. ”

... మధుపర్కవిషయములో :—

కం॥ “ విధియుతముగ ఖచరుఁ డవ, న్యధినాథునకొసఁగెఁ బసిఁడి పారివాణమునన్
మధురమఖభుగ్ఘవీదధి, మధురససంపర్కమైనమధుపర్కంబున్. ”

ఈరీతిగ శృంగారకరుణములు ప్రధాన మగుతావులఁగూడ దీర్ఘసమాసములె, పరుషాక్షరవిన్యాసములే, మాఱుమూలపదములే గాన్పించుచున్నవి. పరుషాక్షరములు వాడుటలో నీకవి కభిలాష మెండు. “ ముదిసిన ” అనుటకు “ జరఠ ” శబ్దమునే తఱచుగా వాడినాఁడు. జరఠపన్నగము (ఆ ౫, ప ౧౧) జరఠకచ్ఛపరాజు (ఆ ౫. ప ౪౭) జరఠాఖుజాతములు (ఆ ౩ ప ౧౧.) ...

హిమవదాదుల వర్ణించుచోట దీర్ఘసమాసములు తగియేయున్నవి. వానికచటఁ దావు కలదు గాని యిచట వాడఁగూడదు. ఈతఁడు దీర్ఘసమాస ప్రియుఁ డనుకథలు గూడఁ గలవు. సూరన “ తలఁపం జొప్పడి యొప్పె నప్పు” డనఁగా నింతలోనే మూఁడు విఱుపులా యని యీతఁ డాక్షేపించినట్లు వాడుకకలదు. ఇది యీతని దీర్ఘసమాస ప్రియునిగా లోకము తలంచుచున్నట్లు తెల్పుచున్నది. సంస్కృతమువాడినచోట దీర్ఘసమాసమే వాడవలె నని యీతని యుత్పలమాలిక బోధించుచున్నది. ......

వీరికవితాకన్యయొక్క వాక్పటుత్వము, వాగ్ధారావిశేషము సంధ్యానాట్యమానమానిత హారజటాజూటనటన్నిర్యన్నదీలహరిం బోలియున్నది. ఈకవితాపాకము ద్రాక్షాపాకమున లేదు. నారికేళపాకమునను లేదు. ఇది యిక్షుపాకమున నున్నదని చెప్పవచ్చును. చెఱకుగడలను బట్టుకొని పెచ్చులూడఁదీసి పంటనొక్కి తినిన మధుర మగురస మూరినట్లే యిందలి దీర్ఘసమాసముల విఱిచి పీల్చి ఘనద్విజసమూహమున గట్టి పట్టుపట్టిన రసమూరుచుండును. సర్వవిధముల శ్రీనాథు ననుకరించిన వానికవిత్వము శిరీషకుసుమపేశల మెట్లు కాఁగలదు. కఠినపాక ముండఁగూడదని నాతలంపుకాదు ప్రౌఢప్రబంధములందు నుండుఁగాక. కాని యట్టిదానిని ద్రాక్షాపాక మనియు నపూర్వ మధురశైలి యనియుఁ జెప్పుటమాత్ర ముచితము కాదు. శ్రీనాథునికవిత్వమునను

కృష్ణదేవరాయని కవిత్వమునకును నేతావు నిష్ఠురో యాతావునే మనుచరిత్ర కవిత్వము వఱకుఁ గొంతవఱకు కీయఁదగినది. వానికిది తరువాతిది. పుట్టుకచేఁ గూడ వానికిఁ దరువాతిదే

... ...

పెద్దనార్యునకుఁ బదములఁ గూర్చుటలో నున్న నైపుణ్యము కథను గూర్చుటలో లేదు. కావుననే కథలలో రససమంచిత మగుకథ యిది యని చూచుకొని స్వారోచిష మనుసంభవము రససమంచితకథలతో నొప్పునది గాన నయ్యది తనరచన కనుకూలమని యెంచి దాని వ్రాయ మొదలిడెను. ఆయంశము నీక్రిందిపద్యము తెల్పుచున్నది.

కం॥ "మనువులలో స్వారోచిష, మనుసంభవ మరయ రససమంచితకథలన్
విన నింపు కలిధ్వంసక, మనఘ భవచ్చతురరచన కనుకూలంబున్."

స్వారోచిష మనుసంభవము రససమంచితకథల నొప్పునది కానఁ దనరచన కనుకూలమఁట. సహజముగా రససమంచితత్వమున్న కథ లేవో యెంచుకొని వానిని దనరచనలోఁ బెట్టె. రసము పుట్టించు సామర్థ్యము తనలో నంతగా లేదు. ఈ సందర్భములో వసుచరిత్రకారుఁ డేమిచెప్పినాఁడో కనుఁడు.

ఉ॥ " కేవల కల్పనాకథలు కృత్రిమరత్నము లాద్యసత్కథల్
వావిరిఁ బుట్టురత్నము లవారితసత్కవికల్పనావిభా
పావహపూర్వవృత్తముల సానలఁదీరిన జాతిరత్నముల్
గావున నిట్టిమిశ్రకథగా నొనరింపుము నేర్పు పెంపునన్."

అని వ్రాసి పురాణములలోఁ బదిపంక్తులలో వ్రాయఁబడియున్న యొకచిన్న కథను దీసికొని రామరాజభూషణుఁడు కడురసవంతము చేసియున్నాఁడు. పెద్దన్న పురాణములలో రససమంచిత మగు కథయేది యని వెతకికొని యట్టిదానిని గని దానిని రచింపఁ దనకనుకూల మని గ్రహించినాఁడు. కథాకల్పనమునందుఁ బెద్దన తగు నేర్పుఁ జూపలేదు. మూలమునందున్న కథనైనను సందర్భశుద్ధిగాఁ దెల్పలేకపోయినాఁడు .

కథ నీతిదాయకమా! దుర్నీతిదాయకమా!—మన పెద్దలు " కావ్యాలాపాంశ్చ వర్జయే" త్తని చెప్పిరి. దుష్కావ్యములఁ బఠింపవల దని దీనిభావము. కావ్యము బహు ప్రయోజనకరముగా నుండవలెనని వారు చెప్పిరి. ... ఇది మనవారిపద్ధతి. ఇఁక నవ నాగరకులగమనికం గనుఁడు.

ఇప్పటి విమర్శకులు గ్రంథములందలి కథలు వర్ణనములు నీతిదాయకములా దుర్నీతిదాయకములా యని విచారించి బహుగ్రంథముల దుర్నీతిదాయకము లని నిర్ధారణముచేసి వానివిషయములో దొరతనమువారి శాసనమును గూడఁ బుట్టించిరి. కవులచరిత్ర కారుఁడు తారాశశాంకవిజయము లోనగు గ్రంథములను గూర్చి వ్రాయునప్పు డందలి

కథయును వర్ణనములును దుర్నీతి కాలవాలము లని నిందించి వైచెను. ఇట్లే బహుగ్రంథములను బరిహసించె. వీ రనుసరించిన ఫక్కిని బట్టి చూచిన మనుచరిత్రము నీచాతినీచ మగు గ్రంథ మగును. ...

దుష్కావ్యము లేవి.—కుచకుచవర్ణనములు, సంభోగాదివర్ణనములు జారత్వాదుల సమర్థించు గ్రంథములును దుష్టగ్రంథములనియు విషపుష్పములవలెఁ జాలహానిని జేయున వనియు నవనాగరకులు సిద్ధాంతీకరించిరి. అట్టిసందర్భము లిందున్నవో లేవో చూతము. ...

మనుచరిత్రమునం దెచటఁ జూచినను జదువరులకు మోహము నుద్రేకింపఁజేయు కుచకుచవర్ణనములే కాన్పించుచున్నవి. ... శ్రీ తేవప్పెరుమాళ్ళయ్యగారు వ్రాసినట్లుగా గొండలు, కుండలు, బండలు నని వర్ణించినంతన యంతగా మోహోద్రేకము పుట్టదు. పాలిండ్లాయాసందర్భమును బట్టి చదువరుల హృదయములందు మోహమును బుట్టింపవచ్చును. పవిత్రమగు భక్తిని గలిగింపవచ్చును. పాలిండ్లమూలముగానే గదా పూర్వము శిశువులు పుష్టినంది పెరుఁగుచు వచ్చిరి. ... "కాటుకకంటినీరు చనుకట్టులఁ బర్వఁగ నేల యేడ్చెదో। కైటభదైత్యమర్దనుని గాదిలికోడల యోయమదంబ" యనినప్పుడును "అంకముఁజేరి శైలతనయాస్తనదుగ్ధము లానువేళ బా। ల్యాంకవిచేష్టఁ దుండమున నవ్వలిచన్గబళింపఁబోయి యా। వంకఁ గుచంబు గానక కహీవల్లభహారము గాంచి వేడ్కనా। శాంకురశంకనంటెడు గజాస్యుని గొల్తు నభీష్టసిద్ధికిన్." అని పలికినప్పుడును యోగ్యున కెవ్వనికైన మోహము పుట్టునా? పుట్టదు. కుచములు యువతుల మనములలోఁ గామోద్రేకమును బుట్టించు చర్యల వర్ణించుచో దాన మోహోద్రేకము పుట్టినఁ బుట్టవచ్చును. మోహోద్రేకమును బుట్టించు కుచవర్ణనము మనుచరిత్రమునం దంతటను గలదు గనుఁడు.

చ॥ "ముడివడు కంకణప్రభల ముత్తెపుసేసలు దోయిలించి యె
త్తెడుతతి బాహుమూలకుచదీప్తులపైఁ బతిదృష్టి పర్వఁ బం
బొడమినలజ్జఁ బాణియుగము న్వెసఁబంచియు మౌళిమీఁదికై
పొడవునఁ జల్లె లేనగవు పొల్తుక రెప్పల నప్పళించుచున్."

ఇచ్చటి కుచప్రశంస యువకుల కెంత మనోవికారమును గలిగించునో చదువరులే యూహించుకొనుఁడు. "ప్రాంచదభూషణబాహుమూలరుచితోఁ బాలిండ్లు పొంగారఁ జై। యంచులఁ గ్రొవ్వెదఁ గీలించి" యనినప్పుడు యువకుల మనము లెట్లుండునో యోజింపుఁడు. మగవాని వలపించుటకై మగువచేయు చేష్టలు వర్ణించుచు "జక్కవకవ్వంబులఁ బోని గబ్బిగుబ్బలం జొబ్బిల్లు కుంకుమరసంబునం బంకిలంబు లగు

హారముక్తాతారకంబులన గిరితీరుపడఁజేయుచు " అని వ్రాయఁబడియున్న దానిని జదివిన నెవ్వని మనము మోహోద్రేకము పాలుగాదు. ఇట్టి వనేకములు కలవు. లోకములోఁ దఱచుగా వాడుకలోనున్న "చన్ను" అను శబ్దమును వాడఁగూడదని యలంకార శాస్త్రకారులు వ్రాసియుండినను బలుతావుల "చన్ను" అను శబ్దమునే పెద్దన్న వాడెను.

... కచకుచవర్ణనము చేసినంతనే దుష్టగ్రంథ మగునా యందురేని యట్లగునని నేనుబలికి యుండలేదు. నవనాగరకాగ్రణులు పలికి యాంధ్రసారస్వతముపై దాడివెడలిరి అదిగాక, పెద్దనార్యుఁడు కచకుచాదివర్ణనములనే గాక యంతకుమించిన వర్ణనములఁ గూడ వివరముగాఁ జేసియున్నాఁడు. కనుఁడు:—

సీ॥ "సహసానఖంపచస్తనదత్తపరిరంభ మాయూలపరిచుంబితాధరోష్ఠ - ఇత్యాది .

క॥ "అన్నన్నఁ గనుమూయుట రొద, సన్నగిలుట కాఁగిలింత సడలుట నేర్పల్
నున్నగుట వరూథినిరతి, కన్నెతెకపురతియుఁ బోలెఁ గడు నింపొసఁగెన్."

... పెద్దన్నగారు కవుల నందఱిని మించి గర్భిణీస్త్రీ సంభోగమునుగూడ వర్ణించి విడిచిరి. కవులచరిత్రకారు లీవర్ణన మెట్లు సహించిరో! మనుచరిత్రమును వీరు నిందింపలేదు. ఆ గర్భిణీస్త్రీ సురతవర్ణనము.

సీ॥ "మనసుకక్కుఱితి మెల్లనలేచి చేతులఁ గాంతుని జబ్బగాఁ గౌఁగిలించు. మొ॥

పెద్దన సురతవర్ణనము "సహసానఖంపచేత్యాదిగా సంస్కృతదీర్ఘసమాసముతో నొనరించె. అది సామాన్యలోకమునకుఁ దెలియదు గావఁ దప్పుకాదని శ్రీమల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు వ్రాసిరి. కాని యీ గర్భిణీసురతవర్ణనము తేటతెనుఁగుమాటలతో నున్నది. నిజముగా సందర్భము లేకున్నను రతిప్రశంస చేయుటయుఁ గలదు. వరూథిని వీణవాయించుటను వర్ణించుటలో "ఆలాపగతిఁ జొక్కి యరమోడ్పు కనుదోయి రతిపారవశ్యవిభ్రమము దెలుప" అని వర్ణింపఁబడియె. సురతవర్ణనము లుండినంతనే గ్రంథమును నీచమనవలదనియు జారత్వమును సమర్థింపఁ జూచినప్పుడే యది నింద్య మనియు నందురా. "అదియు నైనదోలమ్మ" యనినట్లుగా నదియు నైనది గనుఁడు. ...

సీ॥ "వెలిపెట్టిరే బాడబులు పరాశరుఁబట్టి దాశకన్యాకేళితప్పుఁజేసి
కులములో వన్నె తక్కువయయ్యెనే గాధిపట్టికి మేనకచుట్టఱికము
నమువుకాఁడై వేల్పునాగవాసముఁ గూడి మహిమ గోల్పడియెనే మాండకర్ణి
స్వారాజ్య మేలంగనీరైరె సుర లహల్యాజారుఁడైన జంభాసురారి
గీ॥ వారికంటెను నీమహత్త్వంబు ఘనమె, పవనపర్ణాంబుభక్షులై నవసి యినుప
కచ్చడాలట్టుకొను మునిముచ్చులెల్లఁ, దామరసనేత్రలిండ్ల బందాలుగారె."

ఇంతకంటె దుర్నీతి పైకిఁబోవలయునా ! కవుల చరిత్రకారుఁడు శేషము వేంకటపతిం గూర్చి వ్రాయుచు "అంకును మంచిదని సాధించుటకు సహితము మన వారికిఁ బురాణములనుండి దృష్టాంతములు తండోపతండములుగా దొరకుననుట క్రింది పద్యమును నిదర్శనముగాఁ జూపవచ్చును." అని వ్రాసె. అట్లు అంతఃపతనమును సాధించుటకై పురాణములనుండి యుదాహరణములను దంతోపతండములుగాఁ దీసికొనివచ్చిన వారికి మార్గదర్శి మన పెద్దనార్యుఁడై యున్నాఁడు. ఇప్పుడైన నిది దుర్నీతికి మూలమగు గ్రంథమని నవనాగరకు లంగీకరింతురా ! ...

మన పెద్దనగారింతకంటెను బెద్దపనిని గావించిరి. వారినీతి యెంతఘనమైనదో దానిమూలముగా బోధపడఁగలదు. వరూధిని ప్రవరవిరహార్తయై యుండ సూర్యాస్తమయ వర్ణనమును గావించుచు నిట్లు వ్రాసినాఁడు :—

చ॥ "తరుణి ననన్యకాంత నతిదారుణపుష్పశిలీముఖవ్యథా
భరవివశాంగి నంగభవుబారికి నగ్గముచేసి క్రూరుఁడై
యరిగె మహీసురాధముఁ డహంకృతితో నని రోషభీషణ
స్ఫురణ వహించెనో యన నభోమణి దాల్చెఁ గషాయదీధితిన్."

... ఇవి కాముకులమాట లగుచోఁ గామాంధు లిట్లు తలంతురని భావించుకొందుము. ఇది యట్లుగాక కవి తేల్చినభావమై యున్నది. కవికి వేశ్యాసంభోగము నింద్య మనుతలంపులేదు. వేశ్యల నవశ్యమును గూడఁ దగినదే యనియు నదియే సరసత యనియు వీనితాత్పర్యము. కావుననే దానిని ద్రోసివేసిన ప్రవరుని "మహీసురాధముఁ" డని తిట్టి యిది సందుచేసికొని దానిగూడిన గంధర్వాధముని "వియచ్చరప్రవరుఁ" డని స్తుతించె. న్యాయముచే నీకలినామకగంధర్వుఁడు నీచుఁడు. ఏమనఁ దనయం దింతయు వలపులేక తన్ను నసహ్యించుకొనిన వేశ్యను గూడుటకై దాని కెవనియందు వలపున్నదో వానివేషమును వేసికొని దానిని వంచించి దానితోఁ గూడినాఁడు. తనయందు వలపులేని కాంతను మోసముచేఁ గూడువాఁడు తోలుబొమ్మను గూడువానికంటెను నధముఁడగును. ఏమనఁ దోలుబొమ్మకు వీనియందు నేయభిప్రాయమును నుండదు. ఇచట నన్నో వీనియందు వరూధినికి రోఁతగూడఁ గలదు.

... ఇట్టినీచుని మనకవి వియచ్చరప్రవరుఁడని యెట్లువ్రాసెనో బోధపడదు. ఏ యుపాయముచేతనైన నేమి యింద్రియవాంఛలఁ దీర్చికొనినవాఁ డెవఁడో వాఁడే ఘనుఁడని కవి తలంచునేమో ! కావుననే కాఁబోలు నీగంధర్వాధముని మన కవిగ్రామణి "వియచ్చరప్రవరుఁ" డనియు, "గంధర్వపతి" యనియు, "గంధర్వవిభుం" డనియు, "గంధర్వపుంగవుం" డనియు, "ఖచరభర్త" యనియు స్తుతించుటయేగాక

"అంగభవవిద్యాపారగుం" డనియుఁ గూడ వర్ణించె. ఇది పెద్దఘనకార్యమనియుఁ ప్రౌఢతయనియుఁ బెద్దన తలంపు. తనభార్యకాని స్త్రీలెల్లరును బరకాంతలే యనియు వేశ్యారతికూడఁ బరకాంతారతియై పాపమును గలిగించుననియు మనశాస్త్రములు చెప్పుచున్నవి. ... మనవారు తారాశశాంకవిజయము వ్రాసిన శేషము వేంకటకవిని దిట్టిరి. కాని యతఁడు కాముకుల వాక్యములలో నేమి వ్రాసినను దన వాక్యములలో నీతినే వ్రాసె. కనుఁడు :...

చం॥ "ఒంటిగ వచ్చెఁ జంద్రుఁ డిపుడొంటిగ నా తెఱఁగుంటి తేనియల్
గెంటని ప్రేమ గ్రోలి రతికేళిని దేలకయున్న ముత్యపుం
బంటవలంతి వింటిదొర బారికి నోరువలేనటంచు నా
తుంటరి గుబ్బలాఁడి వగతో విగతోరువివేకపాకయై."

అని వ్రాసె. ఇందుఁ గవి, తారను విగతోరువివేకపాక యనియుఁ దుంటరి గుబ్బలాఁడి యనియు నిందించె ఇట్టివి మనుచరిత్రములో లేవు. కావునఁ దారాశశాంక విజయముకంటెను నిది నీచగ్రంథము.

ఇట్లీకృతి గ్రంథము నంతను బచ్చిశృంగారముపాలు చేసివేసినాఁడు. మూలములో, ననఁగా, మార్కండేయపురాణములో స్వరోచి శృంగారనాయకుఁడై యుండి యుండి, నడుమఁ గొంతవిరాగియై తపం బొనరించెనంట. అది తగదని మన కవివర్యుఁడు తీసి పాఱవైచినాఁడఁట! దాని ... తం. తేవప్పెరుమాళ్ళయ్యగారు సమర్థించిరి.

వైరాగ్యము పూని తపస్సుచేసిన విశ్వామిత్రాదులు మరల శృంగారముపాలు కాలేదా ? ఆయంశమును మనకవి తన గ్రంథమున నెత్తియుండలేదా! (కులములో వన్నెకెక్కవ యయ్యెనే గాధిపట్టికి మేనకచుట్టుటికము) తపస్సు చేసిచేసి మరల శృంగారములోనికి వచ్చినట్లు చెప్పిన నయ్యది శృంగారమునకు మఱింత జయమును గలిగించునుగదా ! కొంతకాలము తపస్సునకై వృథాచేయించుట యెందుకని కవి దానిని విడిచియుండును. అది యట్లుండనిండు. వస్తుతత్త్వమేమన; మన తేవప్పెరుమాళ్ళయ్యగారు మూలమును సరిగాఁ జూడక తప్పువ్రాఁత వ్రాసిరి. స్వరోచి హంససంవాదము విని పిదపఁ దపంబొనరించి నిష్కల్మషత్వంబు నొంది యమరలోకంబున కరిగె. మరల శృంగారచేష్టలపాలు గాలేదు.

గ్రంథనామమే కుదిరినదికాదని మనవా రధిక్షేపించుచున్నారు. ... మూలకారుఁడు (1) స్వరోచిసంభవము (2) అతని చరిత్రము (3) స్వారోచిషమనుసంభవము ననుకథ లిందున్నట్లు చెప్పెనేగాని, యాతఁడు స్వారోచిషమనుసంభవ మనలేదు. అయినను మనకవి :—

కం॥ "కోరిక నీస్వారోచిషు, చారిత్రము విని వ్రాయఁ జదివిన ధనధా
న్యారోగ్యపుత్రవంతులు, నై రూఢిగఁ గంద్రు పిదప నమరత్వంబున్."

అని స్వారోచిషచరిత్రమని వ్రాసె. ఇందు నాయకుఁ డొక్కఁడు కాఁడు. నాయిక యొక్కర్తు కాదు. కథ యొకటికాదు. స్వారోచిషమనుకాలవిశేషములు మూలములోఁ దెల్పఁబడినవి. వానినిగూడ మనకవి లాగివేసినాఁడు. ఈమనుకాలము

నందలి యనిమిషులను నింద్రులను గవీశ్వరులను నీతఁడు చెప్పలేదు. అందు శృంగారరసమున కవకాశము లేదని చెప్పలేదు కాఁబోలు. లేకున్న నేల మానవలెను? స్వారోచిషమనువుయొక్క నామమును ద్యుతిమంతుఁడనియున్న దిందుఁ దీసివేసినాఁడు. మనకవికిఁ గావలసినది మనుచరిత్రము కాదు. పచ్చిశృంగారము, పై రేదియైనను నంతగా హాని లేదు. అది యొక యాక్షేపణము కాదు. శృంగారరస మెంతవఱకు నడచినదో యంతవఱకే యీతనికవిత్వము పటుత్వముతో నడచినది. కథాసందర్భ మంతగాఁ గుదురలేదనుట కీయంశ మెత్తితినిగాని మఱియొకటి కాదు. ...

రసము కావ్యమునకు జీవితము. "అథ సర్వేషాం ప్రబంధానాం జీవితభూతస్య రసస్య స్వరూపం నిరూప్యతే" అని ప్రతాపరుద్రీయకారుఁడు వ్రాసెను. "తేషా మాత్మభూతస్య రసస్య స్వరూపనిరూపణం ప్రతిజానీతే" అని వ్యాఖ్యాత వ్రాసె. ఇఁక రసస్ఫురణ మెట్లున్నదో దానిని విచారింతము. ఇందుఁ బ్రధానమగు రసము శృంగారము. కావుననే కవులచరిత్రకారులు "మనుచరిత్రము శృంగారరసప్రధానమైన దిగానున్నది" అని వ్రాసిరి. న్యాయముచే నిది స్వారోచిషమనుచరిత్రము కాదు. ఇది వరూథినీచరిత్రము. ఈ వరూథినీవిషయానుభవర్ణనము చేయుటలోఁ గవి తనరచనాపాటవము నంతను జూపినాఁడు. అందులకై యే మన తేవప్పెరుమాళ్ళయ్యగారు "కవిత్వ" మను శీర్షికక్రిందఁ బెద్దనార్యుని కవితావిశేషముల 15 పుటలలో వర్ణించి ప్రవరుఁడు స్వగృహము చేరువఱకే వివరించిరి. తన కావ్యమును శృంగారనిలయము చేయఁదలఁచిన యీకవి తుదకు శృంగారాభాసము గలకథను దీసికొనెనే గాని నిక్కమగు శృంగారము గలకథను దీసికొనలేదు. వరూథినీప్రవరులలో వరూథినికే యనురాగము కలదుగాని ప్రవరునికి లేదు. కలివరూథినులలోఁ గలికే యనురాగము కలదుగాని వరూథినికి లేదు. ఇట్లేకత్రానురాగ మగుటచే నిందున్నది రసాభాసము కాని రసము కాదు. రామాయణములో రావణున కనురాగమును సీతకు నది లేకుండుటయును లేవా! యం దేమిలోపము వచ్చినదని శ్రీ వెన్నేటి రామచంద్రరావుపంతులుగారు వ్రాసిరి. ఇది వింతవార్త. రామాయణములో సీతారావణులు నాయికానాయకులు గారు. అందు నాయకుఁడు రాముఁడు. సీత నాయిక. రావణుఁడు శూరాగ్రేసరుఁడు. మహాప్రభువు. విత్తవంతులలో నగ్రగణ్యుఁడు, విద్వాంసుఁడు, రసికుఁడు, సౌందర్యవంతుఁడు. ఇంతవాఁ డెంత ప్రయత్నించినను వానియం దిసుమంతయు సీత కనురాగము పుట్టలేదు. రావణుని నిందించి రామునియందే బద్ధానురాగయై యాసాధ్వి యుండుటచేతనే యాసతీమతల్లికి నాయకుని యందుఁ గల గాఢానురాగము వెల్లడియగుచున్నది. రాముఁడు తన సహధర్మచారిణి యగు సీతకై పరితపించి యాగరితను దిరుగఁ బొందుటకై విశేషశ్రమపడి ఘోరయుద్ధములు చేసి యామెను సంపాదించుకొనుటచే నాయకునకు నాయికయం దున్న గాఢానురాగము బోధలోనికి వచ్చుచున్నది. కావున రావణునియందు సీతకు రాగము లేకపోవుటచేతనే రామాయణమునందలి శృంగారరస ముత్తమమై నిక్కమగు శృంగారమైనది. పెద్దనకావ్య మట్టిదైనది కాదు. రసాభాసముకలదియైనది ...

రసాభాస ముపాదేయ మెచ్చటను గాదని నా తలంపు కాదు. కవి రసాభాసమును లోకమునకుఁ జూపఁదలంచి చెప్పినచోట నది యుపాదేయమే. వానివానికిం దగుతావుల దోషములే యుపాదేయము లగును. అట్లే దానికిఁ దగినతావున రసాభాస ముపాదేయ మగుఁగాక! ఇచటఁ గాదు. కవి రసవంతమగు మహాప్రబంధమును వ్రాయఁ దలఁచినాఁడు. ఈ గ్రంథమునందు శృంగార మంగి. అదియె రసాభాసమగుచో నిఁక సారస్యమెట్లుండును! లోకములో నేకత్రానురాగము గలతావులు లేవా యందురేని గలవు. ఒల్లని కాఁపురము లెంతరసవంతములుగా నుండునో యిదియు నంతరసవంతముగా నుండును. పెద్దనగ్రంథమందు నాయికానాయకులు వరూథినీప్రవరు లని పిఠాపురపుసంస్థానము వారు వ్రాయించిన మహేంద్రవిజయపీఠికలో నిట్లున్నది. "మొదటి మూఁడాశ్వాసములందును మనువును గూర్చి యొక్క వాక్యమయిన లేకున్నను గథ కంతకుఁ బ్రధాననాయికానాయకులు వరూథినీప్రవరాఖ్యులయ్యును, ఆంధ్రకవితాపితామహుని ప్రబంధము "స్వారోచిషమనుసంభవ" మను పేరఁ బరఁగుచున్నది."

మనోరమాస్వారోచుల వృత్తాంత మన్ననో స్వారోచికి బహునాయిక లుండుటచే నిదియును రసాభాసమే. దానికిఁ దోడుగా దుఃఖార్తయై యున్న మనోరమకు నామె మనోవ్యథను దొలఁగించుటకు ముందే కళ్యాణాదిశృంగార వైభవముల వర్ణించుటచే నదియును మఱింత రసాభాసమే యైనది. ఇది పెద్దన తెచ్చిపెట్టిన నైరస్యము. మూలములో మనోరమామనోవ్యథ తొలఁగించిన తరువాత వైభవములు వర్ణింపఁబడినవి. తుదకుఁ బెద్దన్న కేళీమందిరమున నాయికచే నేడ్పించినాఁడు. ఇది విరసము కాదా! లోకములో గర్భాధానపు గదులలో నేడ్చెడు గోలలు లేరా యందురేని గలరు. అచటి శృంగార మెట్లుండునో యిచటి శృంగారమును నట్లే యున్నది. కవి శృంగారరసాభిమానిగాఁ గానిపించుచున్నాఁడు. దానినే విశేషముగాఁ బాడుచేసియున్నాఁడు. ఉత్తమకావ్యములం దుండఁదగిన యుత్తమశృంగారరస మిందు లేదు.

శాంతరసమును బ్రవరవిషయమునఁ బురాణములో మారన బాగుగాఁ బ్రవహింపఁ జేసినాఁడు. ప్రవరుని మోహములోఁ బడవేయుటకై వరూథిని యెన్నిపోకలు పోయినట్లు పెద్దనగ్రంథములో వర్ణింపఁబడియున్నదో యాగమనిక యంతయును మారనపురాణమునందును గలదు. అది పురాణము గావున సంగ్రహముగా నావిషయము వర్ణింపఁబడియున్నది. వరూథిని చక్కనిమాటలాడినది, యచటి వైభవమును వర్ణించినది. విప్రుని గృహమునకును దన తావునకును గలభేదము వ్యక్తపఱచినది. అతఁ డేదియు లక్ష్యపెట్టకున్న మీఁదఁబడి గాఢాలింగనముఁ గావించుకొనినది. అయినను నతఁడు చలింపనిహృదయము కలవాఁడై:—

గీ॥ "అంటుకంటుకు నన్ను మృగాక్షి నీవు, సదృశుఁ డగువాని నన్యుని వెదకికొనుము
నిన్ను నొక్కటియడుగంగ నీవు వేఱ, యొకటి గోరి ననుంబొంద నుచితమగునె?"

... అని పలికినాఁడు. అందుపై వరూథిని "విద్యాధరాదుల విడిచి మనుష్యులకడ కేల యురుగంగఁ గడఁగె" దనినఁ

గీ॥ వినుము దర్భలు శరణులు వేదికలును, నగ్నులును నాకుఁ గరముఁ బ్రియంబొనర్పఁ
గాని యొండెందుఁ బ్రియ మెదఁ గలుగ దనియె ”

వరూథిని నీచేత నిరాకృత నగుదు నేని పంచత్వము నొందుదాన నీకుఁ బాపం బగుననిన వాఙ్ఞాని యిట్లనియె:—

కం॥ “ పరవనితారతి కీడని, గురు లెఱిఁగింతు రటుగానఁ గోమలి మదిసా
క్షు రతి జనింపదు నీదెస, నిరతము నాదెస భజింపు నీవును విరతిన్. ”

... అధముఁడు, బేలయుఁ గావుననే ప్రవరుఁ డనన్యకాంతయుఁ దరుణియు నగు వరూథినితో భోగింపక వెడలిపోయినాఁడని పెద్దన్న తేల్చినాఁడు. నూరనవలెఁ బరకాంతారతి పాపముగానఁ ద్రోసివేసినట్లు తేల్చియుండలేదు. పరవనితారతి పాప మనుభావమునే త్రోసివేసినాఁడు.

... “ కలంచునే సతులమాయల్ ధీరచిత్తంబులన్ ” అను వాక్యము నొక్క-దానిని పెద్దన వ్రాసినమాట నిజము. అయినను నియ్యది యచటిగమనికకు సరిపడియుండ లేదు. తాలిమి గలవాఁడు (అహంకృతి గలవాఁడు) అని కవి తలంపేమో? కవి ప్రవరుని విరాగియని చెప్పెఁ గాని వాని వేషవర్ణనము మాత్రము నరల శృంగారపురుషుని గా నొనరించె. శ్రోత్రియునకుండు లలాటమందలి మృత్తిక ధవళధవళములగు జన్నిదములు నీర్కావిపింజె కొంచెముచెప్పి యాపై ... శృంగారవేషమును విరివిగా వర్ణించె.

... మణులుచెక్కిన కుండలములు దాల్చెనఁట! జరియొత్తుచేలము జలతారు కాన్పించురీతి వలివాటుగా వేసికొనెనఁట! రత్నఖచితమైన బంగారు మొలత్రాడు దాల్చెనఁట. (సరిలేని రాకట్టనుదానికి మఱియొక యర్థముకూడఁ బండితులు చెప్పుచున్నారు. రాకట్టు-అనఁగా, రాజులుకట్టెడు కట్టు కట్టినాఁడనియు బంగారుమొల త్రాడు దాల్చినాఁడనియు నర్థము కొందఱు చెప్పుదురు. ఏదనినను సందర్భించియుండ లేదు.) వ్రేలియుంగరము కలదఁట. పెద్దజుట్టుముడి కలవాఁడఁట! ఇవి యన్నియు శృంగారపురుషున కుండవలసిన వేషములుగాని వైరాగ్యవంతుఁడై శాంతరసప్రధానుఁ డగుకర్మఠున కుండఁదగినవి కావు. లోకములో విశేషవిత్తవంతు లగు శ్రోత్రియులు లేకపోలేదు. వారిలోఁ బెద్దవేషము వేయువారును గలరు. అయినను రాచనగరులఁ దిరుగు పురోహితులు, శృంగారపురుషులగు క్షేత్రస్వాములు, సంస్థానాధిపతు లగు దాక్షిణాత్యులు దాల్చు వేషముగాని యిది వైరాగ్యవంతులు, కర్మఠులు నగు నుత్తర దేశపు శాంతరసప్రధానులగు శ్రోత్రియులు దాల్చువేషము కాదు. ఈ పద్యముల నెత్తుకొని చర్చించిన శ్రీ వెన్నేటి రామచంద్రరావుపంతులుగారు లలాటమందు మృత్తిక, చెవులఁ గుండలములు నీర్కావిపింజెదోవతులు, ధవళధవళము లగు జన్నిదములు, కాశికాముద్రయుంగరము, ఇవి ప్రవరరూపము నెంతసరిగఁ దలపించుచున్నవి! అని వ్రాసిరే గాని బంగారుమొలత్రాడు, జలతారు “ కుసుంబా కండువా ” మున్నగు వానిని జల్లఁగ జాఱవిడిచిరి.

ఇందు, జుట్టు కట్టు బొట్టు దంభముగా వర్ణింపఁబడినవి. ఇది శృంగారరసప్రధాను లగు వైష్ణవస్వాముల వేషము. అందులో వస్త్ర పెద్దసది మధ్యవైష్ణవము. భోగప్రియ

త్వము లేదు; కావుననే మూలమునందలి స్వరోచిత్వము మున్నగువానిని లాగి పారవైచినాఁడు. ప్రతినిష్ఠ, వైరాగ్యము గల ప్రవరునకు భోగివేషము వేసినాఁడు.

శృంగారరసైకప్రియుఁ డగు కవి శాంతరసమునకుఁ దగిన సన్నాహము చేయలేక పోయినాఁడు. అది వింతకాదు. పోవునది మంచుమలకుఁ గావునఁ బసిఁడి ప్రాఁత చెఱంగు మిసిమి దోఁపఁ జెలంగు నరుణాంశుకోత్తరీయంబు దాల్చినట్లు చెప్పక విలువగల పసిఁడి సాలువును ధరించినట్లు చెప్పిన బాగుగానుండును చేతిలో జారిచెంబు పెట్టవలసినది. రాకట్టు తీసివేసి నీర్కావిబిళ్ళగోఁచి వర్ణించిన బాగుగా నుండియుండును. శృంగార నాయికకు మోహముపుట్టు పెట్టుటకు సహజసౌందర్య ముండియుండును గదా!

ఈతనికి శ్రీనాథునను కరింప నభిలాష మెండు. సమయము చిక్కినప్పుడెల్ల నాగ మనికలఁ బెట్టినాఁడు. కథాసందర్భము ననుసరించి కవి యీరీతిని వర్ణించి యుండలేదు. అదేమన్న శ్రీనాథుం డీరీతిగా వర్ణించినాఁడు గానఁ దానును నట్లు వర్ణించినాఁడు. శ్రీనాథుఁడు :—

"నిద్దమైన మడుంగు నీర్కావిదోవతిఁ గనక మేఖలతోడఁ గటి ఘటించి"

అని చెప్పినదాని ననుసరించి యీతఁ డిట్లు వ్రాసె :—

మన పెద్దనార్యుఁడు శృంగారరసప్రియుఁడే గాని దానినే పలువిధములఁ బాడు చేసినాఁడు. పచ్చిశృంగారమును హెచ్చుగా వర్ణించినాఁడు. నిక్కమగు శృంగార మీతని గ్రంథమున లేదు. ఈతనిని మార్గదర్శినిగాఁ జేసికొని పునకవులు మనవాఙ్మయ మును బచ్చిశృంగారరసభూయిష్ఠము గావించిరి. ...

మనలాక్షణికులు వీరరసమును బ్రధానముగాఁ జేసికొనిరి. కథానాయకుఁ డెట్టివాఁ డుండవలెనని వారు వ్రాసిరో కనుఁడు. కథానాయకునిగూర్చి లోచనకారుఁ డిట్లు వ్రాసె :—

"ధర్మయుద్ధవీరప్రధానో ధీరోదాత్తః, వీరరౌద్రప్రధానో ధీరోద్ధతః, వీరశృంగారప్రధానో ధీరలలితః; దానధర్మవీరశాంతప్రధానో ధీరశాంత ఇతిచత్వారో నాయకాః

ఇందు వీరరససమాగరౌరాగశ్రేమ మంతటను గాన్పించుచున్నది. వీరరసమునకు యుద్ధమే ప్రధానము కాదు. దానధర్మదయాదులందు వీరరసప్రాముఖ్యము చూపవచ్చును. శృంగారరసప్రాముఖ్యము కలిగింపవలెనని తలంచినను వీరరసప్రధానుఁ డగు విదగ్ధనాయకుని వర్ణించినప్పుడే దాని ప్రాముఖ్య ముండునని మన శాస్త్రకారులు చెప్పియున్నారు. పరికింపుఁడు:—

"శృంగారవీరరౌద్రాద్భుతానాం లోకోత్తరనాయకాశ్రయత్వేన పరిపోషాతిశయః" అని ప్రతాపరుద్రీయకారుఁడు వ్రాసియున్నాఁడు. వీరరసప్రధానుఁడు కాని వాఁడు నాయకుఁడే కాఁడని మనవారితలంపు. మన పెద్దన యీ యంశమును గ్రహించుకొని యుండలేదు. ప్రవరుఁడు వీరాగ్రేసరుఁడు. అంతశ్శత్రుజయము పొందిన మహావీరుఁడు, ధర్మవీరుఁడు. అట్టివానిని మనకవి చేలనుజేసి పిచ్చి పిచ్చివ్రాఁతలు వ్రాసినాఁడు. మహీసురాధముఁ డని తనమాటలలోఁ దేల్చినాఁడు, కలినామక గంధర్వుఁడు వియచ్చరుఁ డైనను [illegible]; జితేంద్రియుఁడు [illegible]. [illegible]

శాత్రవరూపాజీవుల యొత్తిపొడుపులకు జంకక నిలుచుటయే వీరత్వము, ధీరత్వముగా వీని విషయములో వర్ణింపఁబడినవి. ఇట్టివాఁడు మనకవికి రసికాగ్రణిగాను, మహావీరాగ్రేసరుఁడుగాను గాన్పించినాఁడు. ... వలచివచ్చిన యనన్యకాంతను బ్రవరుఁడు త్రోసివేసెఁ గావునఁ బ్రవరుఁడు భూసురాధముఁ డయ్యె. తనపై వలపులేని దైనయనన్యకాంతను నేర్పుమీఱ వంచించి కూడెఁ గావునఁ గలి వియచ్చరప్రవరుఁ డయ్యె. శృంగారరస విషయములో నున్నతభావములు లేని పెద్దన మన ప్రబంధకారులకు మార్గదర్శి యగుటచే మన తెలుంగుప్రబంధములు చాలవఱకు మదనకదనవీరనాయకత్వప్రధానము లైపోయినవి. చదువరులారా! వీరము, మనపూర్వులు మెచ్చినది. పచ్చిశృంగారము కాదు. శాంతరసము మనవారు శిరసావహించినది. అద్భుతరసము మనవారు కొనియాడినది. ఇట్టిరసముల తోడిపాటుగా శృంగారముండిననే యది నిక్కమగు శృంగార మగును. మనకవి వీరమునకుఁ దావు నీయకపోలేదు.

మహాకావ్యలక్షణమునందు యుద్ధము, వేఁట మున్నగువాని వర్ణన ముండవలయు ననియున్నది. కేవల శృంగారమునే పట్టుకొని ప్రాఁకులాడుమని లేదు. పెద్దనార్యుఁడు మహాకావ్యలక్షణముల నన్నిటిని జెప్ప ననువగు కథాసమూహమును దీసికొని తన గ్రంథము వ్రాసినాఁడు. మనుచరిత్రకథలో యుద్ధవీరమున కవకాశము కలదు గావునఁ గవి దానిని సంగ్రహముగా వర్ణించియున్నాఁడు. అది యెంత సంగ్రహమైనను వీరాగ్రేసరుం డగు కృష్ణదేవరాయని యాస్థానకవి యెట్లు వర్ణింపఁదగినదో యట్లే వర్ణించియున్నాఁడు. మానవుని మానవంతునిగాఁ జేయునది వీరము. ఇది రసరాట్టు. మనకవి ధైర్యగుణము నీగతిఁ జక్కఁగా వర్ణించినాఁడు కనుఁడు :—

సీ॥ బుద్ధీంద్రియక్షోభములకుఁ బెట్టినికోట విపదంబురాశిదుర్విక్రృతి కోడ
ఖలదురాలాపమార్గణవజ్రకవచంబు రణమహీస్థలికి శ్రీరామరక్ష
శాత్రవదుర్గర్వసంస్తంభనౌషధి మొనయుచింతాశ్రేణి మూఁకవిప్పు
యోగాదిసంసిద్ధు లొనగూర్చు పెన్నిధి తూలునేకాఁపులతోడునీడ

గీ॥ సకలసుగుణప్రధానంబు సకలకార్య, జాలసాఫల్యకరణైకసాధనంబు
ధైర్యగుణ మట్టిధైర్యంబు దక్కఁబోరఁ, దత్తరింతురె యకట మీతరమువారు."

పూర్వ మీ దేశ మిట్టిధైర్యలక్ష్మి కాలవాలమై యుండెడిది. కావుననే సకల లక్ష్ములు నిచటఁ దాండవ మాడుచుండెడివి. పిఱికితన మిట్లు చక్కఁగా నిరసింపఁ బడియున్నది.

ఉ॥ "కైదువులున్న పూజ్యములు కంకటఖేటశిరస్థలత్రముల్
లే దరదంబు తత్తడి హుళిక్కి సహాయము సర్వమంగళం
బీడనుజుండు చిక్కి భయమేటికి లబ్ధకులార! యాత్మకుం
జేడతనంబు మేలె మఱి మృత్యువు డాఁగెడిచోట లేదొకో!"

హిందూవీరు లెట్టియుత్సాహలఁ గలిగి యుండెడివారో కనుఁగొనుఁడు. పిఱికి తనమును బూనెడివాఁడు మానవశబ్దవాచ్యత కర్హుఁడు కాఁడు. చావు వచ్చునను భయ మునఁ బిఱికివాఁడై యుండినను చావు తప్పదు. మరియు సంప్రాప్తమగు వన దుర్న

రణము సంభవించును. ధైర్యలక్ష్మీసమేతులై చావునకుఁ గూడ జంకక ధైర్యస్థైర్యములతోఁ బూనిన పూన్కి నెఱవేర్చుకొనఁ బ్రయత్నించువారో దైవకటాక్షమునకుఁ బాత్రులై బాగుపడుదురు. ఆయంశ మిట్లు తెల్పఁబడినది :—

కం॥ "చావుఁ దలపోసి మానవుఁ । డేవగ దుష్కీర్తిఁ బొరయకే దినములు పోం
దై వెడలునట్లు నడవఁగ । దైవం బటుమీఁద మేలు తాన ఘటించున్."

ఈయుద్ధము మూలమునం దున్నదే. ప్రబంధమునందు యుద్ధవర్ణన ముండవలె ననువిధికూడఁ గలదు. దానిని మనకవి పెంచి బాగుగానే వ్రాసినాఁడు గాని యొక లోపమును గూడఁ దెచ్చినాఁడు. మూలములో స్వరోచి యసహాయుండై యొక్కరుం డగు రక్కసుని నొక్కండె తాఁకి యుద్ధ మొనరించినట్లుండఁగా మనుచరిత్రములో ననేకులు సాయముకూడ నున్నట్లు చెప్పఁబడినది. అసహాయులుగా నున్నవారలు బోయలే గాని, యెవ్వరైన ననేకు లొక్కనిబొదివి యుద్ధముచేయుట యక్రమ మగును. మన వీరునిశూరత కొకింత లోపమగును. స్వరోచి కిరాతులఁ బ్రోత్సాహపఱిచి రక్కసుని మీఁదికి మరలించినటు కవి చెప్పినాఁడు. కైదువున్నయైయున్నవాని ననేకులు సకలాయుధములతో ముట్టడించుటయు వానిరాయుధుని జంపుటయు నొక పౌరుషమే యగునా! శత్రు వెట్టిస్థితిలో నున్నాఁడన :...

ఉ॥ "కైదువున్న పూజ్యములు కంకటఖేటశిరస్థలత్రముల్
లేదరదంబు తత్తడి హుళిక్కి సహాయము సర్వమంగళంబు"

అను వాక్యము లాతఁడు నిరాయుధుఁడనియు, సహాయశూన్యుఁ డనియుఁ దెల్పుచున్నవి. ఇట్లు మూఁడుదినములనుండి తిండిలేని వానిని నిరాయుధుని నసహాయుని మనవీరుఁడు తాఁకెనఁట; ఇతఁ డెట్టివాఁ డన "మణిగణప్రోతాసి వాతాశనప్రారజ్యత్కటిచక్రుఁ డఁట; ముఖరశార్ఙ్గక్రూరబాహార్గళుఁ డఁట. ఇట్లు మనకవి యక్రమయుద్ధముక్రింద మార్చివేసినాఁడు. మూలములో లేనివేఁట నిచటఁ దెచ్చిపెట్టి మూలములో నసహాయుఁడుగా నున్న స్వరోచిని ససహాయుని జేసినాఁడు. వేఁటలు రెండు చేసినాఁడు. ముందు రాఁబోవు వేఁటయందే యీవర్ణన మంతయును బెట్టుకొనిన బాగుగా నుండునుగదా.

వర్ణనములు కావ్యకన్యయొక్క వాక్చాతుర్యము లనవచ్చును. ఆచాతుర్యములిం దెట్లున్నవో విచారింతము. ఏదే నొకవిషయమును దీసికొని వర్ణింపుమనిన మనకవి మిగుల నిపుణముగా వర్ణించును. వస్తువివరణము చేయుచు వర్ణించుటలో నితని కున్న నేర్పు మిక్కిలి వర్ణనీయము. ప్రతిబింబపట మొక వస్తువుయొక్క రూపము నెట్లు సరిగఁ బొడ కట్టఁ జేయునో యీతని వర్ణనాచాతుర్య మట్లు పొడకట్టఁ జేయును. ప్రవరవర్ణనముం గనుఁడు. అవయవవర్ణనమును జేయుచు ముక్కుపై మూఁడుపద్యముల హాస్యముపై నైదుపద్యములు, పదములపైఁ బదిపద్యములు తొడలపైఁ దొమ్మిదిపద్యములు చెప్పి చదువరులకు విసుగుపుట్టించి యుండలేదు. ...

"అర్ధచంద్రుని తేట నవఘళించులలాటపట్టిక దీర్చిన గంగమట్టితోడ" అది పద్యరాజమునందుఁ గవి శృంగారనాయకుఁ డగు విప్రవర్ణనమును నెటు చిత్రించెనో యిది

వటువుఁ జూపితిని. ఆవిప్రుని యందము దెల్పుపద్యము లింకనొకదాని నిందుదాహరించెదను:

సీ॥ "వదనప్రభూతలావణ్యాంబుసంభూతకమలంబులన వీనికన్నులొప్పె
నిక్కి వీనులతోడ నెక్కసక్కెములాడు కరణినున్నవి వీనిఘనభుజములు
సంకల్పసంభవాస్థానపీఠికవోలె వెడఁదయై కనుపట్టు వీనియురము
ప్రతిఘటించుచు చిగుళ్ళపై నెత్తివాతీనరీతి నున్నవి వీని మృదుపదములు.
గీ॥ నేరెటేటియసల్దెచ్చి నీరజాప్తు, సానఁబట్టిన రాపొడిఁ జల్లి మెదపి
పదను సుధ నిడి చేసెనో పద్మభవుఁడు, వీనిఁ గాకున్నఁ గలదె యీమేనికాంతి."

... ఔషధసిద్ధవర్ణనము:—

సీ॥ "ముడిచిన యొంటికెంజడముాయ ముప్వన్నె మెగముతోలు కిరీటముగ ధరించి
కకపాల కేదారకటకముద్రితపాణి కాంచలాతాముతోఁ గూర్చిపట్టి
రౌద్రాక్షమైన యొడ్డాణంబులవణిచే నక్కళించినపొట్ట చుక్కళించి
యారకూటచ్ఛాయ నవఘళింపఁగఁ జాలు బడుగుదేహంబున భస్మమలఁది
గీ॥ మిట్టయురమున నిడుదయోగపట్టె మెఱయఁ, జెవులరుద్రాక్షపోఁగులు చవుకళింపఁ
గావికుబుసంబు జలకుండికయును బూని, చేరెఁ దద్గేహమౌషధసిద్ధుఁ డొకఁడు."

రక్కసుని వర్ణనము :—

సీ॥ "విసమాసములుగాఁగ పసతోడఁ బెనివెట్టి నెట్టెంబుగాఁ బ్రేవుఁ జుట్టినాఁడు
బండికందెనచాయ బైసిమాలినమేన మెదడు గందపురొంపి మెత్తినాఁడు
కునఖంపుడాచేతిపునుకకప్పెర నిండఁ బ్రాణికోటులవల్లఁ బట్టినాఁడు
కొకిబికివేసంపు గూనివీఁపులమీఁద మూఁడుపంగలయీటె మోపినాఁడు.

గీ॥ నిట్టతాడనఁ బొడవుచే నిక్కినాఁడు
నిడుదకోరల మిడిగుడ్ల నెగడినాఁడు
నరవరోత్తమ నేఁడు మూన్నాళ్ళనుండి
యీసుఱుఁగొన వెంటఁదిరిగెడు నసుర యొకఁడు."

ఇట్లు వివిధరూపవర్ణనములు చక్కఁగాఁ గావింపఁబడినవి. ... కవి హిమాచలవర్ణన మీక్రిందిరీతిగాఁ బ్రారంభించినాఁడు :—

చ॥ "అటు చని కాంచె భూమిసురుఁ డంబరచుంబిశిరస్సరజ్ఝరీ
పటలముహుర్ముహుర్లుఠదభంగతరంగమృదంగనిస్స్వన
స్ఫుటనటనానురూపపరిఫుల్లకలాపకలాపిజాలముం
గటకచరత్కరేణుకరకంపితసాలము శీతశైలమున్."

ఈపద్యము చాల మనోహరముగా నున్నది. ఇందలి దీర్ఘసమాసము శీతశైలముయొక్క యౌన్నత్యమును జెప్పకయే చెప్పుచున్నది. ఇట్టిచోటులనే దీర్ఘసమాసము లుండఁదగినవి. కాళిదాసు, భారవి మున్నగుకవివరులు చేసినంత మనోహరముగా నీతఁడు శీతశైలవర్ణనము చేయలేకపోయినను జేసినంతవఱకు సరసముగానే యున్నది. కర్మఠుఁ డగుప్రవరుఁడు పర్వతవిలోకనముఁ జేయుటలో:—

"వలరాచరాచవాఁడలి కాతుకను వెచ్చఁ గరఁగినయలకనికరపుఁజోటు" మున్నగునవి చూచె ననుటలో సారస్యములేదు. కవి శృంగారరసైకప్రియుఁ డగుటచే నిట్టి వర్ణనములఁ జేసినాఁడు. ఔచిత్యముఁ జూచుకొనలేదు. ఈపద్యము మతప్రధానములగు పవిత్రస్థలముల విశేషములఁ జూపునదిగా లేక విరసముగా నున్నది.

"పుచ్ఛడికతనంబు పోఁబెట్టి గిరికన్య పతిఁగోల్వ నాయాసపడినచోటు"

ఇది స్థలముయొక్క విశేషమును దెల్పుటకుఁ జెప్పినదో పరిహసించుటకుఁ జెప్పినదో తెలియవచ్చుట లేదు. సతి పతికై తపస్సుచేసినచో టనరాదా! ఆయాసపడినచో టనుట యెందుకు! ఈ సందర్భములో భారవిమహాకవి యేమి చెప్పినాఁడో కనుఁడు :—

శ్లో॥ "ఈహార్థ మంభసి చిరాయ తపశ్చరంత్యా
యాదోవిలంఘనవిలోలవిలోచనాయాః ।
ఆలంబతాగ్రకర మత్రభవో భవాన్యా
శ్చ్యోతన్నిదాఘసలిలాంగులినా కరేణ ॥

పవిత్రమగు తపశ్శబ్దమును దీసివేసి, యాయాసపడినచో టనుటచే సారస్యము చెడినది. బాలపై ప్రేమాతిశయము గల తలిదండ్రులు మున్నగువారు తపస్సొనరించుచున్న కూఁతుఁ గని యాయాసపడుచున్న గనిన ననవచ్చును. కవి దాని నాయాసమాత్రముగాఁ జెప్పరాదు. పతినిగోరి యొకయువిద తపంబు నొనరించుటకై పుచ్ఛడికతనము వహింపవలసియుండునా? ఇది పెద్దవింత! తపస్సుచేసె ననుటకు బదులుగా నాయాసపడెనని యెట్లు వ్రాసెనో? పెద్దన్నకుఁ దపస్సులు గిపస్సులు కిట్టవు గాఁబోలు నన వలసివచ్చుచున్నది. వరూథిని వాక్యములలోఁ బెట్టి మునులనుగూడ "మునిముచ్చు" లనియు, "తామరసనేత్రలిండ్ల బంటు" లనియుఁ బరిహసించె. ఇతనికి వచ్చిన దొక్క పచ్చిశృంగారము. వరూథిని నిష్ఫల నాయాసపడుట యనినట్లే కవియును దపస్సు నాయాసపడుటగాఁ జెప్పినాఁడు. అది వింత కాదా! కవి కేవలభోగప్రధానుఁ డగుటచే నియమములనెల్లఁ బరిహసించుచున్నాఁడు. లోకవర్ణనము బహుసరసముగా నున్నది. అది చదువునప్పుడు పాఠకులకు హిమవన్నగమునఁదలి హృదయంగమమగు లోయలో నున్నట్లే తోఁచును.

సీ॥ కులిశధారాహతిపొలుపునఁ బైనుండి యుడుగక మోవఁగ జేగురైనతటులఁ
గనుపట్టులోయ గంగానిర్ఝరము వాఱఁ జలువయౌ నర్యోటికెలఁకులందు
నిసుకవెట్టిన నేల నేచి యర్కాంశులఁ జొరనీక దట్టమై యిరులుగవియ
క్రముకపున్నాగనారంగరంభానాళికేరాదివిటపికాంతారవీథిఁ

గీ॥ గొరలు పికశారికాకీరకేకిభృంగ, సారసధ్వని దనలోని చంద్రకాంత
దరులు ప్రతిశబ్దమీన గంధర్వయుత్త, గానఘూర్ణితమగునొక్కకోనఁ గనియె.

చం॥ నికటమహీధరాగ్రతటనిర్గతనిర్ఝరధారఁ బాసి లో
యకుఁ దలక్రిందుగా మలకలై దగు కాలువ వెంటఁ బూచుచు

ల్లిక లతాలంబనంబుగ నళిప్రకరధ్వని చిమ్మరేఁగ లో
నికి మణిపట్టభంగసరణిన్ ధరణీసురుఁ డేగి చెంగటన్."

శా॥ తావుల్ క్రేవలఁ జల్లు చెంగలువ కేదారంబు తీరంబునన్
మావుల్ క్రోవులు నల్లిబిల్లిగొను కాంతారంబునం దైందవ
గ్రావాకల్పిత కాయమానజటిలద్రాక్షాగుళుచ్ఛంబులం
బూవుందీవెల నొప్పు నొక్కభవనంబున్ గాయడో తీర్ణమున్."

... సూర్యోదయ సూర్యాస్తమయాది వర్ణనములు చేయునప్పుడు కవి చాల ప్రౌఢతను జూపినాఁడు కథానుకూలములగు నంశము లావర్ణనములందు ధ్వనించుచుండు నట్లు చేసినాఁడు. ధ్వని కావ్యజీవితమని మన పెద్దలు చెప్పియుండిరి. అట్టిధ్వనులం గనుఁడు :—

సీ॥ "ఏవిహంగము గన్న నెలుఁగించుచును సారెకును సైకతంబులఁ గూడఁదారుఁ
దారి కన్గొని యది తనజోడు గాకున్న మెడయెత్తి కలయంగ మింటనరయు
నరసి కన్నీటితో మరలఁ దామరయెక్కి వదనమెండఁగ సరోవారినద్దు
నద్ది త్రావఁగ సైఁపకట్టిట్టుఁ గన్గొని ప్రతిబింబమీక్షించి భ్రమసియుండును.

గీ॥ సుతికి రెక్కలందడియ చేష్టలొక్కతమ్మి
కరుగు మరిగి రవంబుతోఁ దిరుగు తేఁట్లఁ
బొడుచు ముక్కున మఱియును బోవు వెదక
సంజఁ బ్రియుఁబాసి వగ నొక్క చక్రవాకి."

ఇది వరూథిని చర్యనంతను ధ్వనింపఁజేయుచున్నది. కథానుగుణముగా వర్ణనము చేయుటఁ గనుఁడు.

గీ॥ "అసురవరుఁ డైనయిందీవరాక్షు మేన, నంటుకొన్న స్వరోచిబాణాగ్నిఁబోలె
నంతఁగనుపట్టె శుకతుండకాంతిఁ దెగడి, సాంధ్యరాగంబు పశ్చిమాచలమునందు."

కొన్నిచోట్ల శ్లేషయందలి యభిలాషచే మనకవి సందర్భరహిత మగు ధ్వని వచ్చునట్లుగా వర్ణించుచువచ్చె ఎట్లనఁగా :—

మ॥ "వికసిల్లం బ్రజ చక్రపాలనము గావించెం గరవ్యాప్తిం
గమలంతంబుల నాక్రమించెఁ బొసఁగంగా నేర్చె వర్ణాళి గాం
తికిఁ బాపెం దెలిరాజకోటిఁ దుదిశాంతింబొందె దైవంబు సేఁ
తకుఁ దాపం బిఁక నేలనంగ నినుఁ డస్తప్రాప్తుఁడయ్యెం గడున్."

ఇందు సూర్యపరముగాను ప్రభుపరముగాను రెండర్థములు చెప్పఁబడినవి ఇది ప్రభువగుస్వరోచి యభ్యుదయస్థితిలోనికి వచ్చునప్పుడు భావిమంగళము లందనున్నప్పుడు మనకవి యినుఁ డస్తమించె ననఁగాఁ బ్రభువు చచ్చె ననుభావము తేల్చె. ఇది యిక్కడ నరిపడలేదు.

ఈకవి రాకలలోను బోకలలోను బరగ్రంథసాహాయ్యమును బొందినను వరూథిని కథను మనోహరముగానే వర్ణించినాఁడు. సెలయేటి నీటి ధారలచే నభివృద్ధినందుచుండు

చిత్రతరోద్యానములో రమ్యతరమగు మందిరమును బెట్టి యందు సుందరీమణి యగు నచ్చరలేమను బెట్టి యందలి పూఁదోఁటలో నా పాటలాధరి పాటలఁ బాడుచుండునట్లు చేసి యాతని ప్రవరుని నచటికిఁ దీసికొని పోయినాఁడు. చాల సరసముగా నున్నది. వరూథినీ పాత్రమును జిత్రించుటలో మన కవి చాల నిపుణుఁడై మెఱసె. ఈతని కవిత్వమున కిదియే కేంద్రస్థానము మనుచరిత్రములో నీ భాగమునే లోకులు విశేషముగఁ జదువుచుందురు. ... ...

మనుచరిత్రమునందు నలంకారశోభ చాల కలదు. ఆ విషయమై యంతగా వ్రాయం బనిలేదు. రసజ్ఞులు మెచ్చుకొను స్వభావోక్త్యలంకారాదులు మెండుగఁ గలవు కాని లోకములోఁ బొందుచున్న యొక భ్రమను దీర్చుటకై శ్లేషనుగూర్చి యొకింత వ్రాయవలసియున్నది ... ...

ఈతని గ్రంథముంగూర్చి ముగించుటకుఁ బూర్వ మీతని శ్లేషకవిత్వముంగూర్చి యొక్కింత వ్రాయవలసియున్నది ఈతఁడు రామరాజభూషణుని శ్లేషకవిత్వము నీసడించెననియు శ్లేషకవిత్వము సులభమని తలంచెననియు లోకులు వచింతురు. అతఁ డీసడించినను లేకున్నను లోకు లీయూహలఁ బ్రకటించుచున్నారు గాన నీతని శ్లేషకవిత్వముంగూర్చి యొకింత ముచ్చటించెదను. ఈతఁడు మనుచరిత్రములోఁ గొన్ని శ్లేషలఁ బెట్టినాఁడు. వానిని దిలకింపుఁడు. కుకవి నిందసల్పుటలో నీతఁడు శ్లేష పెట్టినాఁడు. ఆపద్యము పై నుదాహరించియున్నాను. అందుఁ గొఱతం బడుననుచోటఁ జోరపరమైన యర్థము సరిగ వచ్చుటలేదు, కొఱ్ఱునఁ బడుట యను నర్థము చెప్పవలసివచ్చుచో "కొఱుతఁ" అని వాడవలెను. అట్లుచెప్పినఁ గుకవిపరమగు నర్థము చెడును. కాన శ్లేష కొంతవఱకుఁ జెడినది ... ...

చంద్రోపాలంభము చేయు సందర్భమున యమునకును జంద్రునకును శ్లేషచే సమానధర్మమును గల్పింపఁబోయి "తొలుదొల్తఁ గమలమిత్రునివంక రూపాటు" యను పద్యము రచించె. ఇం దంతటను నర్థద్వయము వచ్చినదిగాని "పరివేషమిషమునఁ బాశంబుదాల్చుట" యనుచోట సరిపడలేదు. కాన శ్లేష సరిగ నడచినది కాదు.

చ॥ "అపరిమితానురాగసుమనోలసయై చిగురాకుఁజేతులం
దపసిని గౌఁగిలించె వనితా యిదె రంభ తలంప రంభ దా
నపరిమితానురాగసుమనోలసయై చిగురాకుఁజేతులం
దపసిని గౌఁగిలించు టుచితంబె కదా యని నవ్వె రంభయున్॥"

ఇం దరఁటిచెట్టు పరమైన యర్థముఁ జెప్పుటలోఁ జిగురాకుఁజేతులు సరిపడవు. ఏమన సుమనోలస యగు రంభకుఁ జిగురాకుఁ జేతు లుండవు. కాన నిది చెడినది. ...

కవి యెంత శృంగారప్రియుఁడైనను దద్విషయములో నెట్టి పిచ్చియూహ లున్నవాఁడైనను యుద్ధవీరమును గొంత చూపినట్లే యావన్యకాంతాసంభోగ మవశ్యకర్తవ్యముగా నెంచువాఁడైనను గృహస్థాదిధర్మములఁ గొన్నిటిని బాగుగా వర్ణించినాఁడు. ...

సీ॥ " కాలకీలలనున్న తంగేటిజున్ను గృహమేధి యజమానుఁ డంకస్థితార్థపేటి
పండిన పేరటికల్పకము వాస్తవ్యుండు దొడ్డిఁబెట్టిన వేల్పుగిడ్డి కాఁవు
కడలేనియమృతంపునడబావి సంసారి సవిధమేరునగంబు భవనభర్త
మరుదేశపథమధ్యమప్రప కులపతి యాఁకటికొదవుసస్యము కుటుంబి

గీ॥ బధిరపంగ్వంధభిక్షుకబ్రహ్మచారి, జటిపరివ్రాజకాతిథిక్షపణకావ
ధూతకాపాలికాద్యనాథులకుఁ గాన, భూసురోత్తమ గార్హస్థ్యమునకు సరియె."

... ప్రవరగృహిణి యెట్టిదిగా వర్ణింపఁబడినదో చిత్తగింపుఁడు.

గీ॥ వండనలయదు వేవురు వచ్చిరేని, నన్నపూర్ణకు నుద్దియౌ నతనిగృహిణి
యతిథులే తేర నడికిరేయైనఁ బెట్టు, నలయుభోజ్యంబు లింట నవ్వారి గాఁగ."

ప్రభువుయొక్క ప్రధానలక్షణము ప్రజారంజన మని పలుతావులఁ గవి వ్యక్తపఱచినాఁడు. ఇది క్రొత్తవిషయము కాదు. మన గ్రంథములన్నియు నట్లే చెప్పుచున్నవి. దానినే మనకవియు వ్యక్తపఱచినాఁడు. శత్రువులపై శరపరంపర, ప్రజలపైఁ గటాక్షపరంపర వినియోగించువాఁ డెవ్వఁడో వర్ణాశ్రమ ధర్మరక్షణము చేయువాఁ డెవ్వఁడో వాఁడు నిక్కమగు రాజని మనకవి వ్యక్తపఱచినాఁడు. సత్ప్రభుపరిపాలనకాల మెట్లుండునో గ్రంథాంతమున నిటు సువ్యక్తము గావించినాఁడు.

సీ॥ " వానలు సరవితో వర్షించె సస్యముల్ వేళ్ళఁగొల్చిగ విఱవీఁగి పండె
నారోగ్యపుత్రపౌత్త్రైశ్వర్యవంతులై బ్రతికిరి నూరేండ్లు పంచజనులు
పూవుఁబోఁడులు పతిదేవతలై రగ్నిభయతస్కరవ్యాధిభయము లడఁగ
ఫలపయఃకుసుమాదిబహుపదార్థంబులు రసగంధసామగ్రి నెసక మెసఁగ

గీ॥ నీత్యుపద్రవమృత్యురాహిత్యయుక్తి
ధర ప్రజావృద్ధిఁ దామరతంపరయ్యె
న్యాయపథమున స్వారోచిసాఖ్యమనువు,
శ్రీలఁ బెంపొంది పాలించుకాలమందు."

... మనుచరిత్రము భాషావిషయములో నుత్తమగ్రంథము. ఇందు సలక్షణ మగు భాష కలదు. కూర్పువిషయములో మధ్యస్థానమునం దుండఁదగినది. రసానుగుణ మగురీతులు వృత్తులు నంతగా లేవు. నీతివిషయములో నిది యధమగ్రంథము. దుర్నీతిఁ గఱపుచున్నది. కాని గృహస్థధర్మవివరణాదికము లిందు బాగుగా నున్నవి. వర్ణనవిషయములో మనోహరగ్రంథము. చక్కని వర్ణనములు కలవు. రసవిషయములో నడిమితరములోఁ జేరఁదగిన దనుటయు నతిశయోక్తి యగునని తోఁచెడిని. శృంగారశాంతములు పాడుచేయఁబడినవి. వీర మొకింతకలదు. ఉత్తమగ్రంథము కాదు. మొదటఁబుట్టిన ప్రబంధములలో నిది గాన నట్లయి యుండును. తెనుఁగుసారస్వతమున శృంగారగ్రంథములు హెచ్చయిపోయినవి. ఇఁక వీరశాంతాదిరసప్రధానము లగు గ్రంథరాజములు బయలు వెడలుఁ గాక !.

లిఖితుఁడు శంఖుని చేతులు తెగఁగొట్టుట.

చం॥ అనవిని నారదుండు కరుణాళుతఁ బెద్దయుఁ బ్రొద్దు ధ్యానమున్
బొనరిచి సాదరంబుగను " భూధవ! నీవు విశుద్ధియావిధం
బును నిజరాజ్యమున్ మగుడఁ బొందువిధంబును గూడఁ జెప్పెదన్.
విను. మిల హాటకేశమున విశ్రుతమౌ నొక క్షేత్ర ముండెడిన్. ౧౯౨

తే॥ మూఁడుజగములవారికిం బూజ్యమైన తన్మహాక్షేత్రమునను దీర్థంబు నొకటి
యఖిలపాపవినాశకంబగుచునుండు. శంఖతీర్థంబటందురు జనులు దాని. ౧౯౩

తే॥ అచట వైశాఖమాసమం దాదివారయుక్తశుక్లాష్టమిని భాస్కరోదయమున
స్నానమొనరించుమనుజుండు సకలకష్టములను దొలఁగి యినద్యుతిఁగలిగి యొప్పు.

తే॥ అన్నిటం దుర్లభంబైన యద్యదిష్ట మభిలషించునో నిస్సంశయముగ దాని
నపుడ పడయును శంఖేశ్వరాభిధానతత్తటస్థితశివలింగదర్శనమున. ౧౯౫

ఆ॥ ఇంతదవ్వువచ్చి తీవు స్వదేశస్థశంఖతీర్థవిధమె సరిగవినవె ?
శంఖతీర్థవిధము శంఖేశ్వరునివిధ మెఱుకపఱతువిను మహీశ! నీవు. ౧౯౬

ఉ॥ ఉండిరి శంఖుఁడున్ లిఖితుఁ డన్వని మున్నొకతల్లిబిడ్డ లు
ద్దండులు వేదశాస్త్రముల. ధాత్ర్యమరేంద్రులు. వారివిభక్తులై
దండిగ నాశ్రమంబులను దౌదవులన్ రచియించి యప్పుడ
ప్పాండొరు చూచుకొంచుఁగర ముగ్రతపంబు చరించి రోప్రభూ! ౧౯౭

ఉ॥ ఆమునిజంటలో లిఖితుఁ డగ్రజుఁ డాతనిఁ జూచిరా మదిన్
బ్రేమజనింప శంఖునకుఁ బ్రీతి నొకానొకనాఁడు మెల్లఁద
ద్ధామమునొద్దకుంజని యతం డటలేమిని బ్రొద్దుపోక కా
రామవిహారమున్సలుపు చందలి పక్వఫలంబులం గనెన్. ౧౯౮

క॥ కని యగ్రజునెడలం గలచనువున నొకకొన్ని త్రెంపుసమయంబునఁ దాన్
జను దెంచిలిఖితుఁడచటికిఁ దను వడుగక త్రెంపినట్టితమ్మునిమీఁదన్. ౧౯౯

చం॥ అలిగి " దురాత్మ! యేమిపనిరాయిది ? పెంచుచుఁ బెద్దఁజేయు నా
ఫలములఁ గొన్నవాఁడవు తపఃక్షయమౌనటు. భూమిదేవతా
కులమునఁబుట్టి చౌర్యమునకుం దలపడ్డవిధంబుఁజూచి పె
ద్దలు నిను నిందసేయ దురితంబు గడించితివీవు " నావుడున్. ౨౦౦

ఆ॥ " ఏకగర్భభవులమిరువుర, మదియునుంగాక జ్యేష్ఠుఁడవును నావు నీవు
పృథివి నెందువిన్నఁ " బితృసమో జ్యేష్ఠ " యనెడిశ్రుతి ప్రసిద్ధయగుచు శ్రుతులఁబడెడి

ఆ॥ కానఁ బితృధనమున నూనున కధికార ముండియుండదొకో పండితేంద్ర!
చౌర్యమిదియటంచుఁ జాలఁ గఠోరోక్తులాడుచున్న వాఁడ" వనుడు నత్తఁడు.

చం॥ ఇరువురుఁజేలిపోక యొకయింటన యుండినయప్డు తండ్రిసొ
మ్మరయక తీయవచ్చుఁగొడు. కందున దోసము రాదు కాని యొ
వ్వరిగృహమందువారు స్థిరవాసము సేయుచు వేఱుపోయియుం
డరలఁ దదీయవిత్త మణుమాత్రముగొన్నను జౌర్యమయ్యెడిన్. ౨౦౩

తే॥ కొడుకుతసొత్తు విభక్తుఁడై కూడఁ దండ్రి కొనునుగాకది యొక దొంగతనముగాదు
మనువు దీనికిఁ జెప్పెఁ బ్రమాణముగను శ్లోకమొక్కటి. యద్దానిఁ జూచుకొనుము

శ్లో॥ త్రయ ఏవాధనాః ప్రోక్తా భార్యా దాస స్తథా సుతః
యత్తే సమధిగచ్ఛంతి. యస్యతే తస్య తద్ధనం " ౨౦౪

చం॥ అనవుడు శంఖుఁ "డియ్యది మహాత్తరవాక్యము యయ్యెనేని నా
యొనరిచియున్న యట్టి యలఘూగ్రతపంబు నశింపకుండఁగన్
నను మును శిక్షితుంజలుపు" నా లిఖితుండు దయానపేతుఁడై
యనుజు భుజద్వయుంబు నఱకె నక్కట! స్వచ్ఛతగానిత్రేటునన్. ౨౦౬

ఆ॥ అహహా! యాబ్రాహ్మణుఁడు ఛిన్నహస్తయుగళుండై వ్యధంపడుచుంగూడ నదినిజాగ్ర
జుని ప్రసాదంబుగా మదిం జూచెఁగాని యన్యధాయెంచఁ డెంతసహనమొ కనుము.

కం॥ అంతట సకలేష్టదమని యెంతయు భావించి హాటకేశ్వరమునకున్
జెంతలక పోయి యటనొక కాంతిసరఃప్రాంతమందుఁ గడునిష్ఠమెయిన్.

సీ॥ వర్షఋతువునఁ బెద్దవర్షంబులందుండి శతరుద్రములఁజాల జపమొనర్చెఁ
జలికాలమున శీతజలములనిలుచుండి సామరుద్రముల హృత్స్థములఁజదివె.
నలఘుగ్రీష్మమునఁ బంచాగ్ని మధ్యస్థుఁడై భవరుద్రములలెస్సఁ బరనసేసె
వర్షకాలమునఁ బసాపపుచుం బ్రీతిఁ బ్రాణరుద్రముల స్తోత్రంబుసలిపె.
నొగిఁ బ్కుండనూక్తయుత నీలరుద్రపారాయణంబుమిగులనాచరించెఁ
దానునిలిపినట్టి స్థాణుభాస్కరవిగ్రహములయెదుటఁజేరి యాద్విజుండు. ౨౦౯

ఆ॥ అంత వేయియేండ్లకాదిత్యముఖగాత్రమూర్తియైనయట్టి మూఁడుకనుల
సామి దర్శనంబొసంగి "శంఖా! నీదుతపము నన్నుఁ జాలఁ దనియఁజేసె. ౨౧౦

చం॥ ఎదియదిఁగోర యీతపము నీవు చరించుచునుంటొ దాని ని
చ్చెదఁజెపు" మన్న నాద్విజుఁడు చేతులుమోడ్చి "మహేశ! నీవు స
మ్మదమునుబొంది యిష్టవరమున్ దయసేయఁదలంచెదేని నా
కదితమలోఁగాక ముసుపుంపెనభంగి మదీయహస్తముల్. ౨౧౧

శా॥ స్నాపై నక్కటికంబుఁజూపుచును గంగాజాట! యీలింగమం
దేప్రొద్దున్ రహిఁ సంక్రమించిమను. నింకేతజ్జలాధారమున్
నాపేరం బ్రథితంబొనర్చి యొగి దీనన్ స్నాతులౌ వారి దు
ష్ప్రాపార్థంబును బెద్దఁజేసి యిదు చాచంద్రార్క మిందుంచు" నాన్. ౨౧౨

మ॥ "ఇది వైశాఖసితాష్టమీదినము. వ న్నీ వాఁడు దర్శించితీ.
వదియేహేతువుగాఁగ నీతదురులింగాకారముం జొచ్చి యుం
డెద నీయొక్కదినంబు. వచ్చి యెవఁడేనిన్ భానువారాన్వితై
తదహోవస్సునఁ దావకీనఘనతీర్థంబందు సుస్నాతుఁడై ౨౧౩

తే॥ త్వత్ప్రతిష్ఠితమన్మూర్తి తద్భక్తితోడఁ బూజింపఁగలిగినఁ దోడుతోడ
వాఁడు కుష్ఠాదిగదముల వీడి నాదు లోకమొందును. వలదిందు నీకుశంక. ౨౧౪

కం॥ మఱియొకనాఁడేనియు నీకరణిని ద్వత్తీర్థజలవగాహ మదర్చా
పరిచర్యల జరిపినవరు లెఱుఁగక చేసినయఘంబు లెల్ల నశించున్ ౨౧౫

శా॥ ఆమాడ్కిం దెగఁగొట్టఁబడ్డ భవదీయుంబైన హైదోయియున్
దా మత్రోక్తసమస్తలక్షణయుతైతద్యోగసుస్నాతవా
చో మున్నున్నటులుండు నెండి. యిపుడే చూపింతు నిందాడియా
నామూర్తిన్ విధిచోదితంబుగ వెసన్ క్ష్మాపాల! పూజింపుమా. ౨౧౬

శా॥ ఈవైశాఖసితాష్టమీదినమునం దిందాడి మన్మూర్తి సం
సేవింపన్ వికలాంగులైన యొరులున్ శీఘ్రంబుగన్ ముక్తి గం
ద్రోవిప్రా!" యని యష్టమూర్తి నిజఖద్యోతస్ఫురన్మూర్తిచేఁ
దా వ్రచ్చి యద్భుత్యుఁ డౌటయును నాతం డప్డు శుద్ధాత్మతన్. ౨౧౭

మ॥ అభిషేకం బొనరించి యాసరసిలో నాదిత్యు నర్చించియున్
శుభవాఁగాకని తన్నుఁదాను గలయంజూడన్ యథాపూర్వమా
ద్విభుజంబుల్ కనుపట్టె దేహమునఁ బృథ్వీపాల! యమ్మేదినీ
ఋభుఁ డబ్రంపడి నాఁటఁగోలెఁ దప మందే చేసి ముక్తిం గనెన్. ౨౧౮

కం॥ కావున నీవును భూవర! యా వైశాఖీయమగు సితాష్టమిదినమం
దావిధమున నే స్నానము గావించి యజింపు ముష్ణకరవిగ్రహమున్. ౨౧౯

కం॥ ఎవఁడీయ్యది ప్రతిదినమును రవిముందఱఁగూరుచుండి రహిఁ బఠియించున్
శ్రవణించుఁ దదన్వయసంభవులుం గుష్ఠంబుబాటేఁ బడ రెక్కపుడున్." ౨౨౦

— తాంబూల ప్రభావము. —

మ॥ అని దేవర్షి వచించుడున్ విని నృపుండౌ సిద్ధసేనుండు త
ద్ఘనవైశాఖసితాష్టమీతిథియు మార్తాండీయవారమ్ముగా

డను రాఁ గల్యమునంద పోయి కడువేడ్కఁ శంఖతీర్థంబులో
మునుకవైచి యిష్టార్చనంబు నెఱపంబో యెట్లో కష్టంబుగన్. ౭౨౧

ఆ॥ అంతఁ దత్క్షణంబ యపగతకుష్ఠుఁడై దివ్యదేహుఁడగుచుఁ దేజరిలుచు
ధరణిపాల! యతఁడు పరమసంతోషంబు పడెను. నంతకన్న భాగ్యమున్నె.

తే॥ అవలఁ దాంబూలచర్వణప్రాప్తమైనకొలఁదిఁ బాచితమొనరించుకొని యతండు
స్వపితృపైతామహంబగు సకలరాజ్య మాక్రమించుచు శ్రీమంతుఁడై చెలంగె.

ఆ॥ నాగవల్లి పైనె నలిగియో చినిఁగియో చూర్ణమయియొ యున్న పర్ణములను
భక్షణంబు సేత పాపంబు గావున దానిఁగూర్చి పాచితంబు వలయు ౭౨౪

ఆ॥ శంఖతీర్థరాజసంబంధమై నట్టి దీని నీకు వినిచినాను సరిగ
నిఁకను నేమివినుట కిష్టంబుగలదో వచింపవయ్య. చెప్ప సిద్ధముంటి " ౭౨౫

వ॥ అనివక్కాణించుటయు నానర్తనృపాలుండు. ౭౨౬

ఉత్సాహము.— " చూర్ణపర్ణభక్షణమున క్షోణినాథునింట వి
స్తీర్ణమైయెసంగులక్ష్మి చెదరిపోయెననుట యా
కర్ణనంబు సేయ నయ్యెఁ గరమువింత. యెటులిఁకన్
నిర్ణయించెఁ బాచితంబు ? నీవనుడువు మద్దియున్. " ౭౨౭

వ॥ అనియడుగుటయు విశ్వామిత్రుండిట్లనియె. ౭౨౮

చం॥ " తములపుటాకు పావనము ధర్మదమున్ విధితోడ దాని వ
క్త్రమునఁ బ్రవేశపెట్టనగుఁ దప్పిన దోషము. గావునం బ్రయ
త్నమునను నంతో యింతో మును దానముసేసి యనంతరంబునన్
దములము సేయుటొప్పగు సజాతవపద్ధతి నుండువారికిన్. " ౭౨౯

వ॥ అనియిట్లు నొడువుటయు వెండియు నమ్మహీవల్లభుండు. ౭౩౦

కం॥ " తాంబూలి యేప్రకారమునం బుట్టెను ? దాని చర్వణంబు నశాస్త్రీ
యంబుగఁ జేసెడిచో దోషం బెటులఘటిల్లుఁ. జెపుము సంయమివర్యా ! "

వ॥ అనఁ బ్రశ్నించుటయు మఱియు విశ్వామిత్రుం డిట్లనియె. ౭౩౧

తే॥ " ప్రశ్నభారంబు నిడితి నాపైని గాని యుత్తరంబిత్తుఁ గౌతుకంబున్న నీకుఁ
జూర్ణదళభక్షణంబునఁ బూర్ణదోష మేలప్రాప్తించునదియును నోలి వినుము.

చం॥ అమృతముఁగూర్చి పూర్వము సురాసుర లబ్ధి మథించి. రష్టక
వ్యముగనొనర్చి మందరము వాసుకి యోక్త్రముగాను జేసి పు
చ్ఛము నమరుల్ ముఖంబు బలి చక్కఁగఁబట్టిరి విష్ణునాజ్ఞచేఁ
గమఠము మోచునొప్పగా నెఁ గష్టమునోరిచి కవ్వపుంచులన్. ౭౩౪

కం॥ తిరిగొండ యంత బలిమిని గిరగిరఁ ద్రిప్పంగఁబడుడు క్షీరసముద్రాం
తరమునఁ బ్రభవించెను మొద లురుతరరత్నములుమూఁ డహో యన వడియున్.

సీ॥ అగ్గలంబును నల్లనైనబట్టలతోడ దడ్డమైన యదేవన్నె యొడలితోడఁ
బల్లకీబొంగుఁ బోల్పఁగఁదగు ముక్కుతోడఁ గడుఁ బెద్దదగు తలకాయతోడఁ
బోలుగజ్జనుబోలు పొడవైన మెడతోడ గుబ్బువెళ్ళెడి బానపొట్టతోడ
నటుకులయంతేసి యలఁతికన్నులతోడఁ గంచిచేటలవంటి కాళ్ళతోడఁ
గప్పపండ్లతోడఁ గర మడల్లిగించు చౌకఁడు నట్టిరూపి యొలసి ప్రేలఁ
గొడుకుఁగుఱ్ఱఁ బట్టుకొని చాలుబరువుననుండు వాని పెండ్ల ముట్టిపడిరి. ౨౩౬

కం॥ తిరుచుచుఁ దరుచుచు నుండిన గిరివరముఁ బరిత్యజించి గీర్వాణులు నా
శిరు లంతకుమిక్కిలి యా వరరత్నములను గ్రహింపఁ బరువెత్తిరటన్. ౨౩౭

కం॥ పరువెత్తి యచటనుండిన పరమవికారంపుబోడలి భార్యను భర్తన్
సరిగం గనుగొని వెనుకకు నరుదెంచిరి బిట్టు నవ్వు చన్యోన్యంబున్. ౨౩౮

కం॥ పదపడి బలి సాంజలియయి యదితిజులకు మాకు ముఖ్యుఁడగు హరివుచే
నెది మొదలఁబుట్టు నయ్యది త్రిదశజ్యేష్ఠుండు పొందితీరఁగవలయున్. ౨౩౯

ఆ॥ తత్సమర్పణమునఁ దప్పక యీమంథనమున నిష్టసిద్ధి యామరువనకుఁ.
గాన నయ్యజుండు కైకొనుఁగాక యీమూఁడురత్నములనుగూడ" ననుడు.

సీ॥ బలిపల్కినది చాల బాగుగానున్నదం చురరీకరించె నాయుక్తి శౌరి.
బాగుబాగని పదింబదిగఁ బ్రశంసించె రూఢి భోళాశంకరుండు దాని
నింతకంటెను లేవ మేమియుండునటంచుఁ బురుహూతుఁడొట్టివేల్పులు పొగడిరి,
మూఁదొర గొంతరయు మంచియోజన చేసెనని విశేషించి వాకొనిరి యసురు
లంతలోన బ్రహ్మ యనఖిలాఢ్యుండయ్యు వారిమాటమీఁది గౌరవమున
రత్నములనుమూఁడు రమణమై గ్రహియించె మరల నెల్లరబ్ధి దరిచి రంత.

సీ॥ సుడియొక్కఁ డొలయఁడుఁ బొడమె వారుణి బలి రహిఁ దానిఁగొనె బలారాతియెదుట
నింకనొక్కయావర్త మేర్పడఁ గౌస్తుభం బుదయించె. హరి దాని నెద ధరించె
మఱియొక్కయుదకభ్రమంబురా జాబిల్లి కలిగె. నాతని శూలి తలను జేర్చె.
వేఱొక్కటుంబుట్టెఁ బారిజాతము. నందనమున వేల్పులు దాని నాటుకొనిరి.
వన్నెయూరి కామధేను వాపయిని బుట్టె నదియె గోలోకమునకు ద్యోసరణిఁబట్టె
వైద్యరాజయినట్టి ధన్వంతరియదాను నమృతకలశంబు గైకొని యవలవెడలె ౨౪౦

ఉ॥ అంతట నొక్కమాఱె సుర లాశ లీయది మంది మాది యం
చెంతయు గుంజులాడుదు మహేశ్వర! వైద్యుఁడు దేవతాళికిన్

గాంతసుధాకరమండలము ప్రవ్యథగాలికిఁ జేరఁజిక్క న
త్యంతము లుబ్ధులై తరిచి రంబుధి యందుఁగూడి వెండియున్. ౨౪౩

చం॥ పదపడి శుభ్రవస్త్రయును బంకజహస్తయు నై వెలుంగు శ్రీ
యుదయమునొంది శౌనకుని యారోగ్యుఁడటంచు హరిన్ వరించె స
మ్మదమునఁ గ్రమ్మఱం దరువ మందుము తెచ్చెను గాలకూటము. మ
ద్యాదిగని దేవదానవులు హాయని దూరముపాటి రేమనన్. ౨౪౪

ఆ॥ తీవ్రమైనదానిఁ దీవ్రపరాక్రముండగు కృశానురేతుఁ డందుకొనుచు
భక్షణంబు సేసెఁ బదపడి. యదె హేతు వతఁడు నీలకంఠుఁడై రహింప ౨౪౫

ఉ॥ మందరవాసుకిప్రభృతి మంథనసాధనముల్ త్యజించి యు
ల్కం దదనంతరంబున విలాపరిపాల! సుధానిమిత్తమై
యుందఱుఁ బోరొనర్చిరి సురాసురు లొండొరు రోషిదాకృతిన్
బొంది యుపేంద్రుఁ డప్పుడ మోహపయోనిధి ముంచె నాదటన్. ౨౪౬

ఉ॥ ఆవగలాడిమూర్చ్చటల కగ్గలమున్ బలి మోసపోయి గో
త్రాధర! పొందుసేసి యమృతంబునొసంగెను. దానిఁగొంచు నిం
ద్రావరజుండు స్వాకృతి రయంబుగ వేల్పులఁజేరి "తృప్తిగన్
ద్రావుఁడు చావులేకమని దైత్యులగెల్తు" రటంచుఁ బల్కెడున్. ౨౪౭

తే॥ వారు మంచిదియని యటుం గూరుచుండి క్రోలి రమృతంబు నందఱుంగూడి కరుసఁ
బడసి యమరత్వమును దత్ప్రభావమునను నమరవీరులఁ బరిమూర్చ్చి రాలమందు.

ఉ॥ పానవిధిన్ విధుంతుదుఁడు బాగుగ దైవతవేషధారియై
తానును గూరుచుండి సుధ ద్రావఁగ డంగుడు గుర్తుపట్టి రా
భానుఁడు చంద్రుఁ డయ్యసురుఁ. బద్మదళాక్షునకున్ వచించి. రా
ధీనిధి వానిశిరము ద్రెంచె సుదర్శనచక్రధారలన్ ౨౪౯

కం॥ తలదెగఁగొట్టఁగఁబడియును నిలవ్రాలక యమరభావమొనసిన యామొ
క్కలుఁడగు రక్కసుఁ గనుగొని వలమురిదాల్పుడు సాంత్వవాక్యంబులచేన్.

కం॥ "వదలుము రాహూ! దైత్యులఁ. ద్రిదశులకున్ సమ్మతముగఁ దేజరిలుము. ని
న్నిదిమొదలుగ గ్రహమండలిఁ బదిలముగం జేర్చి భక్తిఁ బ్రజ పూజించున్."

చం॥ అసివచియింప వల్లెయని యాదితిసూనుల నుజ్జగించి యు
ల్లస గ్రహమండలస్థుఁడయి లాభమొ నష్టియొ చేసికొంచు భూ
జనుల సమర్చనంబులను జాలగ్రహించుచునుండె నాతఁ. డ
య్యనిమిషు లెంతయున్ విజయమందిరపాంపతిమంథనంబునన్. ౨౫౨

తే॥ త్రావఁగా మిగిలిన యమృతమును సురలు నందనమునకుఁ గొనిపోయి నాగరాజు
కట్టుకంబము మొదటను బెట్టుటయును సహర్నిశములు పదప్రాపిరైన దాని. ౨౫౩

ఉ॥ వ్రేటులకుం గమండలువు భిన్నముగా నట సంగ్రహించెఁదా
నాటఁబుఁడీవయొక్క డది వైళము తద్గజబంధనంబుపై
నీటుగఁ బ్రాఁకుచుం గరము నివ్వటిలం బొడగాంచి దేవతల్
గాటు సుగంధముం గలిగి క్రాలుచునుండు తదీయపర్ణముల్. ౨౫౪

తే॥ త్రెంపి భక్షింపఁగడఁగిరి దేవవైద్యుఁడైన ధన్వంతరియును దాని నరసిసరిగ
నాగబంధోద్భవంబౌటు నాగవల్లియన స్వర్గస్థానమునుగునిది యుంచుఁ బలికె. ౨౫౫

తే॥ తములంబగొప్పడివిధమునఁ గ్రముకంబులతోడ మఱియును ఖాదిరపుం జూ
ర్ణముతోడఁగూడ సంయుక్తముఁజేసెనతండు దానిఁ గడుఁ జతురుండై ౨౫౬

ఆ॥ అంతఁ గొంతకాల మరుగుపై వాణివత్సరికనామధేయధరణినాథుఁ
డింద్రుఁగూర్చితపము సెంతయుఁగావింప మెచ్చియుచటికపుడు వచ్చియతఁడు

తే॥ "ఓయిధరణీశ! నీచేయు నుగ్రతపమువలన మిక్కిలిసంతోష మొలసె నాకు
నీదుమదిఁ గోరుకోరిక యేదొచెప్పు మిచ్చిపోయెద" ననపుడు నెలమిపొంది ౨౫౭

కం॥ ఆ రాజన్యుండిట్లను. "గోరాజా! మెచ్చి నాదుకోరిక యిడెదేన్
సారెకు నీలోకమునకు నే రా సువిమానమొకటి యీఁగదవయ్యా." ౨౫౮

కం॥ అనియిట్లు వేడుకొనుటయు మనఱకుగవేగమైన మహితవిమానం
బును గరుణ నొసఁగె నింద్రుఁడ దినదిన మదియెక్కి యతఁడు త్రిమ్మలిఁగలిగెన్.

కం॥ చనుదెంచి త్రిదివమునకుం దను దర్శించి చనునపుడు దైవతవిభుఁడా
యనకుం దాంబూలంబిడి యనిపెనివాఁ డతనిమీఁది యక్కటికమునన్ ౨౬౧

ఆ॥ పరమభాగ్యమునను భక్షింప నద్దాని వృద్ధునకును గామవృద్ధియయ్యె.
నంత నింద్రునడిగి యునికిం గొంపోయి నాటెఁ దనదుతోఁట నాగవల్లి ౨౬౨

ఆ॥ అది క్రమక్రమముగ నఖిలదేశంబుల వ్యాప్తమగుడు దాని భక్షణమున
నఖిలజనులుగూడ నయిరి కామాత్ములు యజనయాజనాదు లంతరించె ౨౬౩

కం॥ అంతం గ్రతుభుక్సంతతి చింతిలుచుం దమ్మిచూలి చెంతకుఁజని యా
వింత నివేదించిరి యయ్యంతరమున నే యతండు యజనార్థముగన్ ౨౬౪

తే॥ పుష్కరక్షేత్రమునకుఁదాఁ బోవుటయును దరిద్రదేవత కడు దేవురింపుతోడ
నతనికడకేగి యభివాదమాచరించి యెంతయును వినయంబుతో నిట్టులనియె

తే॥ "బ్రాహ్మణులయిండ్లలోనుండి పనవుచుంటిఁ గాన ధనికులగృహములం గాఁపురంబు
సేయు నొక స్థానముం జూపవే యచటను దృప్తితోడ వసింతు నో దేవ! నేను"

క॥ అనియిటు నారదమునిచేత నుడువఁబడి, ఆ వనజాసనుఁ డాత్మఁ గొంతవడి ధ్యానంబున్
బొనరిచి దరిద్రదేవతఁ గనుగొని యోదార్చుచుఁ గడ కిట్లనియెన్. ౭౮

సీ॥ "నలుగుడువడినట్టి నాగవల్లిదళాలు స్థానంబులగునీకు జడియకోయి.
పర్ణాగ్రములు నీదు భాగ్యము నీకును విడుదులగును దుఃఖపడకుమోయి.
తొడిమలన్నియు నీదు కొడుకునకును నీవు సెలవులయ్యెను మదిం గలఁగకోయి.
రాత్రివేళల ఖాదిరంబగు పొడి మీకు ముగుగకుం డెంకియరా వగవకోయి
యేరుపఱచి నాఁడ నీవాలిగింటిని మీకుఁగా దరిద్ర! వీఁక నేగి
భాగ్యవర్ధ్వహములు ప్రభువులగృములం జొచ్చి ఛిద్రములను జూచుకొనుము"

క॥ అనియాగతిఁ బచియించెను జననాథ! దరిద్రుఁగూర్చి చతురాస్యుఁడు. ది
ని. నెఱుంగక యా భూపతి యొనరిచెఁ దాంబూల మవిధి నొగి సిరి తొలఁగన్

క॥ తాదృగ్విధతాంబూలాస్వాదనమునమైన దోసఁగు సకలంబును నా
భూదయితుఁడు పాచితమునఁ దాఁ దొలఁగంద్రోసికొనియె ధారుణినాథా!

ఆ॥ పర్వకాలమునను బండితబ్రాహ్మణుఁ బిలిచి యతని పాదములను గడిగి
కట్టఁ గప్ప రెండు పుట్టంబు లర్పించి యర్ఘ్యభంగిఁ బూజ లాచరించి ౭

ఆ॥ స్వర్ణపర్ణములను స్వచ్ఛమౌ ముత్తెంపుఁ జూర్ణమలఁది చాల శుభ్రమైన
రౌప్యఖాదిరమున రమ్యమై దూర్యపుం గ్రముకములను విడెముగట్టి దాని ౭

శ్లో॥ యన్మయాభక్షితం పూర్వం వృంతాగ్ర పత్రసముద్భవం
చూర్ణపత్రం తథైవాన్య ద్రాత్రౌ ఖాదిరమేవచ
తస్యపాపస్య శుధ్యర్థం తాంబూలం ప్రతిగృహ్యతాం. ౭

క॥ అనుమంత్రంబున నవ్విప్రునకు సమర్పింపవలయు ముదమున. విప్రుం
డును వక్ష్యమాణమంత్రంబును నుడివి గ్రహింపవలయు భూవర! దానిన్ ౭

శ్లో॥ యజమానహితార్థాయ సర్వపాపవిశుద్ధయే
అజ్ఞానాత్ జ్ఞానతోవాపి మతాంబూలం ప్రభక్షితం ౭
భక్షయిష్యసి యచ్చాన్య త్కదాచిన్మే ప్రసాదనాత్
తస్యదోషో నతేభావీ మమవాక్యా దసంశయం. ౭

తే॥ ఈవిధంబునఁ దాంబూల మిచ్చెనేని చనుఁగు తాంబూలభక్షణజనితదోష
మట్లు నివరించి నాఁడుఁ దఱనిపతికిఁ బాచితంబును జేయించి పాపె నఘము ౭

౨ బం

౧౩ తిగుళ్ళ కృష్ణ

౧౪ కాకుమాను హనుమయ్య

౧౫ తిప్పరాజు కామేశ్వరరావుగారు,

౧౬ భాస్కరగాయని వెంకట రామయ్యగారు,

౧౭ నరసింహాస్వామివారు, యాదగిరి

౧౮ బీరకాయల హనుమంతరావుగారు, రాయగిరి

౧౯ జాలూరి వెంకటరత్నముగారు, వకీలు, గుంటూరు

౨౦ మెదక్ కిషన్ రావు దేశముఖుగారు, నల్లపల్లి

౨౧ జానపాటి సుబ్రహ్మణ్యంగారు, ప్లీడరుగుమాస్తా, గురిజాల.

౨౨ లింగాల సీతారామరెడ్డి బండారెడ్డి దేశముఖుగార్లు-నారాయణపురం

౨౩ కవులూరి నరసింహారావుగారు, తాలూకా గుమాస్తా-నర్సారావుపేట

౨౪ గోటేటి వేణుగోపాలరావుగారు, పోలీసు సబిన స్పెక్టరు, ప్రత్తిపాడు

౨౫ రాచకొండ వెంకటరామయ్యగారు,యెనమదల

౨౬ కప్పగంతు సుబ్బారావుగారు - పోలీసుసబిన స్పెక్టరు - గుంటూరు

౨౭ మండవ చినవెంకయ్యగారు, దండమూడి

౨౮ శ్యామాపంతుల గోపాలరావుగారు - హైదరాబాద్

౨౯ కన్నయ్యగారిసంగయ్యగారు-ముసలాపురం

౩౦ చక్కిలం పాపయ్యగారు-ముసలాపురం

౩౧ తాళ్ళవెలిమె లింగన్న మైకద్దంగారు-గడిపెద్దాపురం

౨ కిషన్ రావు దేశపాండ్యాగారు తాళ్ళపల్లి

౩౩ సుబ్బారెడ్డి దేశముఖుగారు, క్షీరసాగరం

౩౪ చివుకుల శ్రీరామశర్మగారు- నాగులుప్పలపాడు

౩౫ గజవాడ వెంకటాచార్యులుగారు, అల్లాదుర్గము

౩౬ కాకిరాల రామచంద్రయ్యగారు, మముదాపురము

౩౭ లక్ష్మీనారాయణ గౌడు సెట్టిగారు, అందోలు

౩౮ ఇటికాల రాజేశ్వరరావుగారు - వకీలు కంభంమెట్టు

౧– వెలమకన్ని శోభనాద్రిరావుగారు - శోభనాద్రిగూడెం

౧ తిరుమలవల్లూక్ చక్రవర్తి వరదాచార్యుల అయ్యవార్లంగారు - శాతాపురం.

౧ కొండంభట్లగారి వెంకన్న గారు. గుమ్మడిదల

౨ వెంకటరాజయ్య, మక్తేదారు - సీతారాంపురం

ఉర్సాన
1 కి రు 3-0-

పుస్తకములు.

	0	4	(
	0	4	(
	0	8	0
...ంమంజరి (సింహాద్రి వెంకటాచార్యులు)	0	4	0
... ఎరూపాక్షపీఠగురుపరంపర	0	2	0
6 నీతిగీతులు (సుమతిశతకమునకు సంస్కృతము)	0	2	(
7 విశ్వబ్రాహ్మణశబ్దఖండనము, బ్రాహ్మణశబ్దవిచారము	0	2	0
8 విగ్రహారాధన ఖండనఖండనము	0	4	0
9 చిత్తూరుజిల్లాతీర్పు విమర్శనము (పత్రికాధిపతి)	0	4	(
10 సంగదోషము	0	3	(
11 అస్పృశ్యతానివారణ ఖండనము(మల్లాది రామకృష్ణచయనులుగారు)	0	8	(
12 వత్సలనీతిశతకము	0	1	(
13 శివానందలహరి (తంగెడ రామకృష్ణకవి)	0	4	(
14 నర్సారావుపేట శతావధానము (తిరుపతివెంకటీయము)	0	3	0
15 పశ్యాంపుశ్యాం	0	2	0
16 పశ్యశబ్దవిచారము	0	2	0
17 పురశ్చరణము	0	2	0
18 శంతనురాజచరిత్ర	0	14	0
19 వర్ణవ్యవస్థ	0	4	
20 స్వర్ణకారవ్యవహారము	1	8	(
21 శుద్ధాంధ్రహరిశ్చంద్ర చరిత్రము	0	10	(
22 అభినవశాకుంతల నాటకము	0	8	0
23 మాతసంహిత-ఆంధ్రము	2	0	0
24 స్కాందమహాపురాణాంతర్గతనాగరఖండము (౧ సంపుటము)	1	0	0
25 డిటో నాగరఖండము (౨ సంపుటము)	1	8	0
26 భారతీయప్రబోధము (పిడుపాటి చిదంబరశాస్త్రి)	0	4	0
27 ధర్మనిర్ణయము	0	4	
28 భారతకథాతత్త్వనిర్ణయము(మల్లాదిరామకృష్ణవిద్యాచ్ఛయనులుగారు)	0	4	

అభినవసరస్వతీకార్యస్థానము, జానపాడు, పిడుగురాళ్ళపోస్టు
గుంటూరు జిల్లా